సోమవారం
22-05-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 329
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఎల్ సాల్వడార్ ఫుట్‌బాల్ మైదానంలో తొక్కిసలాట

ఎల్ సాల్వడార్ రాజధాని సాన్ సాల్వడార్‌లోని కస్లలాన్ ఫుట్‌బాల్ మైదానంలో తొక్కిసలాట జరిగింది. 12 మంది ప్రాణాలు కోల్పోగా దాదాపు 500 మందికి గాయాలయ్యాయి. సుమారు 100 పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు చెప్పారు.

2లో

మీటరంటే ముడుపులే...!

విద్యుత్ శాఖలో అవినీతి ఊడలు

- వాణిజ్య భవనాలు, పరిశ్రమలు, అపార్ట్‌మెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు లక్షల్లో డిమాండ్
- ఏసీబీ సోదాల్లో వెలుగుచూసిన ఏడీఈ అక్రమాస్తులే నిదర్శనం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:
విద్యుత్ శాఖలో అవినీతి మితిమీరిపోయిందని ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమ ఇళ్లకు మీటరు కావాలంటే ముడుపులు చెల్లించుకోవలసిన దుస్థితి నెలకొందని సామాన్య, మధ్యతరగతి ప్రజలు వాపోతున్నారు. ఇక వాణిజ్య భవనాలకు, పరిశ్రమలకు, అపార్ట్‌మెంట్‌లకు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసుకోవడం కూడా కష్టంగా మారింది. వాటికి అనుమతులు ఇచ్చే విషయంలో కొంతమంది అధికారులు, సిబ్బంది తమ జేబులు నింపాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. ఇటీవల ఏఈడీ ఇంటిపై ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించిన నేపథ్యంలో కోట్లాది రూపాయలు అక్రమాస్తులు వెలుగులోకి వచ్చాయి. ఇది విద్యుత్ శాఖలో అవినీతి ఏ స్థాయిలో ఉందో స్పష్టం చేసింది. రాష్ట్రంలో అతిపెద్ద నగరంగా ఉన్న విశాఖపట్టణంలో విద్యుత్ కనెక్షన్ పొందేందుకు పడిన కష్టాలు వర్ణనాతీతం. మధురవాడ ప్రాంతంలో కొండ మీద చిన్న ఓ రేకుల షెడ్డు నిర్మించుకున్న ఒక యజమాని విద్యుత్ కనెక్షన్ కావాలని కరెంట్ ఆఫీస్‌లో ఉద్యోగిని సంప్రదించాడు. ఇంటికి సంబంధించిన అన్ని కాగితాలు ఉంటే 10 వేలు, లేకుంటే 20 వేలు ఖర్చు అవుతుందని సలహా ఇచ్చేశాడు. దీంతో ప్రభుత్వం ఇచ్చిన పట్టా మాత్రమే ఉందని చెప్పడంతో విద్యుత్ కనెక్షన్‌కు రూ.15 వేలు అవుతుందని చెప్పాడని ఆ ఇంటి యజమాని తెలియజేశాడు. కొత్తగా భవనం నిర్మాణం అయితే సిబ్బందికి, అధికారులకు పండుగే. ముఖ్యంగా గ్రూప్ హౌస్‌లు, అపార్ట్‌మెంట్‌లకు ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు తప్పనిసరి కావడంతో భారీ మొత్తంలో ముడుపులకు డిమాండ్ చేస్తుండటంపై అనేక మంది బిల్డర్లు లబోదిబోమంటున్నారు. 20 కిలో వాట్స్ దాటితే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు తప్పనిసరి కావడంతో లక్షల్లో అంచనాలు పెంచి, భారీ మొత్తంలో ఓ పక్క ముడుపులు, మరోపక్క సంస్థకు డీడీలు కట్టాల్సి వస్తోందని ఆయా భవన యజమానులు, బిల్డర్‌లు వాపోతున్నారు. బిల్డర్లకు విద్యుత్ శాఖ అధికారులు

- మిగతా 2 లో

ప్రచార కాంక్షతోనే
మోదీ చర్యలు

పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతే ప్రారంభించాలి

అందుకు ప్రధాని సరికాదు : డి.రాజా

న్యూఢిల్లీ:
పార్లమెంటుకు రాష్ట్రపతే అధిపతి కాబట్టి నూతన భవనాన్ని ప్రారంభించాల్సింది కూడా వారేనని ప్రతిపక్షాలు తేల్చిచెప్పాయి. నూతన పార్లమెంటు భవనాన్ని ఈనెల 28న ప్రధాని మోదీ ప్రారంభించబోతుండటాన్ని తప్పుపట్టాయి. ఇది రాష్ట్రపతి చేయాల్సిన పనని, అందుకు ప్రధాని సరైనవారు కాదని నొక్కిచెప్పాయి. ప్రచార కాంక్షతో నిబంధనలను మోదీ తుంగలో తొక్కుతున్నారని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. 'ప్రధానిగా ఉన్న వారు కార్యనిర్వాహక వ్యవస్థకు నాయకత్వం వహిస్తారు. పార్లమెంటు... శాసన కార్యనిర్వాహక వ్యవస్థ కాబట్టి కొత్త పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించడం సముచితంగా ఉంటుంది' అని రాజా ట్వీట్ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్ శర్మ, ఆర్జేడీ నేత మనోజ్ ఝా, ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తదితరులు రాజాతో ఏకీభవించారు. పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించడమే సరైనదని, దీనిని ప్రధాని ప్రారంభించడం రాజ్యాంగవిరుద్ధమన్నారు. 'పార్లమెంటు భారతదేశ రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి తలమానికం. దీనిని అప్రతిష్ఠపాల్జేయరాదు. పార్లమెంటుకు రాష్ట్రపతి అధిపతి అని రాజ్యాంగంలోని అధికరణ 79 స్పష్టం చేస్తుంది. ప్రధాని లోక్‌సభకు నాయకులు. అధికరణ 85 ప్రకారం రాష్ట్రపతి ఒంటరిగా పార్లమెంటును నిర్వహించగలరు. ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తారు. ప్రధాని, రాజ్యసభ సభాపతి సెంట్రల్ హాల్‌లో కూర్చుంటారు. రాజ్యాంగాన్ని అన్ని విధాలుగా గౌరవించాలి. రాష్ట్రపతియే పార్లమెంటు నూతన భవనాన్ని ప్రారంభించాలి' అని ఆనంద్ శర్మ వరుస

- మిగతా 2 లో

రాహూల్‌ది అదే మాట

2లో

ఈ'సారీ' రాలేను

సీబీఐకి ఎంపీ అవినాశ్ రెడ్డి మళ్లీ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి మరోసారి సీబీఐకి లేఖ రాశారు. తన తల్లి అనారోగ్యం దృష్ట్యా సోమవారం విచారణకు హాజరుకాలేనని లేఖలో పేర్కొన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన తల్లి శ్రీలక్ష్మి డిశ్చార్జ్ అయిన తర్వాతనే విచారణకు వస్తానని తెలిపారు. కాగా, ఇప్పటికే రెండుసార్లు (ఈనెల 16, 19న) సీబీఐ విచారణకు అవినాశ్ రెడ్డి గైర్హాజరయ్యారు. దీంతో ఈ నెల 22న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ సీబీఐ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలంటూ వాట్సప్‌లో సీబీఐ నోటీసు పంపింది. వాస్తవానికి ఆయన శుక్రవారమే సీబీఐ విచారణకు హాజరుకావాల్సి ఉంది. జూబ్లీహిల్స్‌లోని తన ఇంటి నుంచి సీబీఐ కార్యాలయానికి బయలుదేరిన అవినాశ్‌రెడ్డి తన తల్లికి ఆరోగ్యం బాగోలేదని సమాచారం వచ్చిందంటూ మార్గమధ్యలోనే రూటు మార్చుకుని వెళ్లారు. ఆయన న్యాయవాదులు సీబీఐ కార్యాలయానికి వెళ్లి ఈ సమాచారం అందించారు. అవినాశ్‌రెడ్డి తల్లిని పులివెందుల నుంచి కర్నూలులోని విశ్వభారతి ఆసుపత్రికి తీసుకురావడంతో శుక్రవారం నుంచి ఆయన అక్కడే

- మిగతా 2 లో

నిన్న వాతలు... నేడు కోతలు

- ఎండల తీవ్రతతో పతాకస్థాయికి విద్యుత్ వినియోగం
- డిమాండ్‌కు తగ్గ సరఫరా లేక అనధికార కోతలు
- ముందస్తు అంచనా ఉన్నా జాగ్రత్త పడని యంత్రాంగం
- ఎడాపెడా కోతలతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
సర్దుబాటు చార్జీల పేరుతో ఇప్పటివరకు భారీగా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు వాతలు పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు వేసవి డిమాండ్‌కనుగుణంగా విద్యుత్‌ను సరఫరా చేయలేక అనధికార కోతలు విధిస్తూ ప్రజలను తీవ్ర ఇక్కట్లకు గురిచేస్తోంది. అసలే గత 10 రోజులుగా ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయిలో నమోదు అవుతుండడం, దీనికితోడు ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితుల్లో కరెంట్ కోతలు వినియోగదారులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయి. వాస్తవానికి కొన్ని నెలల తర్వాత రాబోయే విద్యుత్ డిమాండ్‌ను సాంకేతికత ఆధారంగా అంచనా వేసే వ్యవస్థను రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు అభివృద్ధి చేశాయి. దాని ఆధారంగా వేసవి కాలంలో గరిష్ఠంగా విద్యుత్ డిమాండ్ 250 మిలియన్ యూనిట్లు దాటుతుందని అధికారులు అంచనా వేశారు. అయితే మే నెలలో వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గుతుందని భావించారు. దానికనుగుణంగా 230 ఎంయూల విద్యుత్ సమకూర్చుకునేలా ప్రణాళిక రూపొందించారు. కానీ వ్యవసాయ విద్యుత్ వాడకం తగ్గినప్పటికీ అంచనాలను దాటి రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం 256 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. ఈ నెల 10వ తేదీ తర్వాత ఉష్ణోగ్రతలు తీవ్రం కావడంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. 10వ తేదీ 218.34 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉండగా, తర్వాత రోజురోజుకూ పెరుగుతూ ప్రస్తుతం 255 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. ఆ మేరకు సరఫరా చేయలేక రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సమయాల్లో అనధికార విద్యుత్ కోతలు అమలు చేస్తోంది. వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను ముందుగా అంచనా వేసి కూడా దానికనుగుణంగా ముందస్తు చర్యలు పటిష్టవంతంగా చేపట్టకపోవడం ప్రస్తుత కోతలకు కారణంగా నిపుణులు పేర్కొంటున్నారు. జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల దగ్గర తగినంత బొగ్గు నిల్వలను ఇప్పటికీ సమకూర్చుకోలేదు. ఫలితంగా రాష్ట్రంలోని కృష్ణపట్నం, ఆర్టీటీపీపీ, వీటీపీఎస్, హిందూజా, జల విద్యుత్, గ్యాస్, పవన, సౌర విద్యుత్‌లన్నీ కలిపి 19,239 మెగావాట్ల ఉత్పత్తి అవ్వాల్సి ఉండగా, కేవలం 6,205 మెగావాట్లు మాత్రమే విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. కృష్ణపట్నం 2,400 మెగావాట్లకు గాను 1,400, ఆర్‌టీపీపీ 1,650 మెగావాట్లకు గాను 1,356, వీటీపీఎస్ 1,760కి గాను 1,073 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా, జల విద్యుత్ 1,901 మెగావాట్లకు గాను 261 మాత్రమే ఉత్పత్తి అవుతోంది. ఇక గ్యాస్, సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి అంచనాలకు పూర్తి విరుద్ధంగా మొత్తం 10,488 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి గాను కేవలం 1,631 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి జరుగుతోంది. దీంతో ప్రభుత్వం బహిరంగ మార్కెట్ నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుతం రోజుకి 45 మిలియన్ యూనిట్లకు పైగా విద్యుత్‌ను బహిరంగ మార్కెట్ నుంచి కొనుగోలు చేస్తున్నారు. అయినప్పటికీ డిమాండ్‌కు తగ్గ విద్యుత్‌ను సరఫరా చేయలేక దాదాపు 8 మిలియన్ యూనిట్ల మేర అనధికార కోతలు విధిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెలలో అనేక ప్రాంతాల్లో

- మిగతా 2 లో

బంగారం వైపు
పరుగులు...!

- రూ.2 వేల నోట్ల ఉపసంహరణతో కొనుగోళ్లకు ప్రజల ఆసక్తి
- కేవైసీ నిబంధనలతో కొంత వెనుకంజ
- కొంతమంది వ్యాపారులు రూ.2 వేల నోట్లకు బదులు 5 నుంచి 10 శాతం అధిక ధరకు విక్రయం

న్యూఢిల్లీ :
రూ.2 వేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటామని భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ప్రకటించిన వెంటనే చైనా తర్వాత ప్రపంచంలోని రెండవ అతిపెద్ద బంగారం వినియోగ దేశమైన భారతదేశంలోని ఆభరణాలు బంగారం లేదా వెండి కొనుగోళ్ల కోసం ప్రజలు మరింత ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే, 2016లో నోట్ల రద్దు సమయంలో కనిపించిన పరిస్థితికి భిన్నంగా విలువైన లోహాన్ని కొనుగోలు చేసేందుకు ఎలాంటి భయాందోళనలు లేవని జ్యువెలర్స్ బాడీ జీజేసీ ఆదివారం తెలిపింది. వాస్తవానికి గత రెండు రోజులుగా కేవైసీ నిబంధనల కారణంగా రూ. 2,000 నోట్ల మార్పిడిలో అసలు బంగారం కొనుగోలు తక్కువగా ఉంది. అయితే కొంతమంది స్వర్ణకారులు బంగారం తీసుకొని 5-10 శాతం ప్రీమియం వసూలు చేయడం ప్రారంభించడంతో 10 గ్రాముల బంగారం ధర రూ.66 వేలకు చేరిందని ఆ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం, దేశంలో బంగారం 10 గ్రాముల ధర దాదాపు రూ.60,200 గా ఉంది. 'రూ.2 వేల నోట్ల ఉపసంహరణతో బంగారం, వెండి కొనుగోళ్ల గురించి శనివారం పెద్ద సంఖ్యలో ప్రజలు ఆసక్తి కనబరిచారు. అయితే కఠినమైన కేవైసీ నిబంధనల కారణంగా కొనుగోళ్లు తక్కువగా ఉన్నాయి' అని అత్యున్నత మండలి ఆలిండియా జెమ్ అండ్ జ్యుయలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) చైర్మన్ సాయమ్ మెహ్రా పీటీఐకి తెలిపారు. అటువంటి భయాందోళనలు ఏమీ లేవని, మార్కెట్ నుంచి 2 వేల రూపాయల నోట్లను ఉపసంహరించుకోవడానికి ఆర్‌బీఐ నాలుగు నెలల గడువును ఉంచినందున అడుగులు కూడా స్థిరపడ్డాయని ఆయన అన్నారు. మే 19న భారత రిజర్వ్ బ్యాంక్

- మిగతా 2 లో

ఇదీ లోకం!



అంటే అంత పక్కాగా చేసారా కోడిగుడ్డు మంత్రిగారూ?

సమస్యల పరిష్కారానికి

రోడ్డెక్కిన సచివాలయ ఉద్యోగులు

ప్రభుత్వ ఉత్తర్వులు సక్రమంగా అమలు చేయాలి

అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్

3లో

ఎల్ సాల్వడార్ ఫుట్‌బాల్ మైదానంలో తొక్కిసలాట

12 మంది మృతి-500 మందికి గాయాలు

- 100 మంది పరిస్థితి విషమం
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం

ఎల్ సాల్వడార్: ఎల్ సాల్వడార్ రాజధాని సాన్ సాల్వడార్‌లోని కస్తలాన్ ఫుట్‌బాల్ మైదానంలో తొక్కిసలాట జరిగింది. 12 మంది ప్రాణాలు కోల్పోగా దాదాపు 500 మందికి గాయాలయ్యాయి. సుమారు 100 పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు చెప్పారు. ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో చేరుకోవడంతో తొక్కిసలాట జరిగిందని నేషనల్ సివిల్ పోలీసులు ఆదివారం తెలిపారు. ఎఫ్ఏఎస్‌కు అలియాంజా బృందాలకు మధ్య మ్యాచ్‌ను చూసేందుకు వచ్చిన వారంతా ఒక్కసారిగా లోనికి వెళ్లేందుకు యత్నించడంతో ఈ దుర్ఘటన జరిగిందని అధికారులు చెప్పారు. మ్యాచ్ ఆపేశారని, అత్యవసర సిబ్బంది స్టేడియం మొత్తం ఖాళీ చేయించారని తెలిపారు. వందలాది మంది పోలీసు అధికారులు, జవాన్లు గుమ్మిగూడగా, అంబులెన్సు పెద్దఎత్తున చేరుకొగా అక్కడ ఆందోళనకర పరిస్థితి నెలకొన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనపై దేశ ఆరోగ్య మంత్రి ఫ్రాన్సికో అలబీ ట్విట్టర్ ద్వారా స్పందించారు. 12 మంది చనిపోయారని, వీరిలో తొమ్మిది మంది స్టేడియంలో ప్రాణాలు కోల్పోగా మిగతా ముగ్గురు వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మరణించినట్లు నేషనల్ సివిల్ పోలీస్ డైరెక్టర్ మౌరిసియో అర్రిజా చెప్పారు. అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి జువాన్ కార్లోస్ బైడెగెయిన్ మాట్లాడుతూ పౌర రక్షణ సేవల సిబ్బంది సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. 500 మందికిపైగా గాయపడినట్లు అత్యవసర సేవల సంఘం 'కమాండోస్ డె సల్వామెంటో' అధికార ప్రతినిధి కార్లోస్ ఫ్లుయంటెస్ చెప్పారు. సుమారు 100 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు. జన తాకిడికి స్టేడియం ద్వారం విరిగి పడగా తొక్కిసలాట జరిగిందని అన్నారు.

దోషుల్ని ఉపేక్షించం: అధ్యక్షుడు బుఖేలే

ఈ ఘటనపై ఎల్ సాల్వడార్ అధ్యక్షుడు నయిబ్ బుఖేలే దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. దర్యాప్తునకు ఆదేశాలు జారీచేశారు. బాధ్యులను శిక్షిస్తామని ప్రకటించారు. 'క్రీడాకారుల బృందాలు, మేనేజర్లు, స్టేడియం, బాక్స్ ఆఫీసు, లీగ్, ఫెడరేషన్' అందరిపై దర్యాప్తు జరిపిస్తామని, దోషులు ఎవరైనా సరే ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు.

చింతిస్తున్నాం: సాల్వడార్ ఫుట్‌బాల్ ఫెడరేషన్

స్టేడియంలో తొక్కిసలాట జరగడం, 12మంది చనిపోవడం, వందల మందికి గాయాలు కావడంపై సాల్వడార్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ చింతన వ్యక్తం చేసింది. బాధితులకు సంఘీభావాన్ని తెలిపింది.

పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు: ప్రత్యక్ష సాక్షులు

స్టేడియం బయట అభిమానులను చెదరకొట్టేందుకు పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారని, దాంతో తొక్కిసలాట జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. బయటకు వెళ్లే మార్గాలు ఇరుకుగా ఉండటంతో ఊపిరి ఆడక చాలా మంది చనిపోయినట్లు వెల్లడించారు.

బఖ్‌ముత్ మా మనస్సులోనే...

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

హిరోషిమా: జపాన్‌లోని హిరోషిమాలో జరుగుతున్న జీ7 సదస్సులో భాగంగా ఆదివారం నిర్వహించిన వర్కింగ్ సెషన్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్‌స్కీ పాల్గొన్నారు. జపాన్ ప్రధాని కిషిడా, యూరోపియన్ కౌన్సిల్, యూరోపియన్ కమిషన్ సహా జీ7దేశాధినేతలు హాజరై ఉక్రెయిన్‌లో తాజా పరిస్థితులపై చర్చించారు. అనంతరం శాంతి, సుస్థిరతకు అంకితమిచ్చిన సమావేశంలోనూ ముఖ్యఅతిథిగా జెలెన్‌స్కీ పాల్గొన్నారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌తోనూ భేటీ అయ్యారు. రష్యా దాడులపై స్పందించారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం జరుగుతుండటంతో తమ దేశంలోని కీలక ప్రాంతాల్లో తీవ్రస్థాయిలో నష్టం జరిగిందని జెలెన్‌స్కీ తెలిపారు. తమ సైన్యం వీరోచితంగా పోరాడుతోందని, రష్యా దాడులకు దీటైన బదులిస్తోందని చెప్పారు. బఖ్‌ముత్ తమ మనసుల్లో మాత్రమే మిగిలిందన్నారు. అయితే ఉక్రెయిన్‌లో కీకల ప్రాంతమైన బఖ్‌ముత్‌ను స్వాధీనం చేసుకున్నట్లు రష్యా ప్రైవేటు సైన్యం వాగ్నర్ గ్రూప్ ప్రకటించింది. పుతిన్ కూడా అభినందించినట్లు రష్యా అధికారిక వార్తా సంస్థ టాస్ పేర్కొంది. ఎనిమిది నెలలుగా మాస్కో సేనల మద్దతుతో వాగ్నర్ ప్రైవేటు సైన్యం చేస్తున్న దాడులతో ఆ నగరం మొత్తం శిథిలమైందని ఉక్రెయిన్ పేర్కొంది. రష్యన్లు చెబుతున్నట్లుగా అక్కడ ఏమీ మిగల్లేదని, ఆ ప్రాంతం మొత్తాన్ని రష్యన్లు నాశనం చేశారని, శిథిలాలు మాత్రమే మిగిలాయని జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తంచేశారు. బఖ్‌ముత్ తమ మనసుల్లో మాత్రమే మిగిలిందన్నారు. జీ7 సదస్సు కోసం జపాన్ పర్యటన క్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రష్యా దాడులు, బఖ్‌మత్ స్వాధీనం చేసుకున్నట్లు రష్యా ప్రకటనపై స్పందించారు. 224 రోజులుగా ఉక్రెయిన్ సైన్యం అక్కడ వీరోచితంగా పోరాడుతోందన్నారు. రష్యా ప్రకటనను ఖండించారు.

సూడాన్‌లో కాల్పుల విరమణ

ఖార్టూమ్: యుద్ధ ప్రభావిత సూడాన్‌లో ఈనెల 22 నుంచి 29వ తేదీ వరకు కాల్పుల విరమణ కొనసాగనుంది. కొన్ని రోజులుగా సైన్యం, పారామిలటరీ బలగాల మధ్య యుద్ధం జరుగుతోంది. రాజధాని ఖార్టూమ్‌లో శనివారం భీకర వైమానిక దాడులు జరిగింది. ఈ పరిస్థితుల్లో ప్రకటించిన కాల్పుల విరమణ అనేకమార్లు ఉల్లంఘనకు గురైనట్లు సౌదీ అరేబియా తెలిపింది. తాజాగా ఏడు రోజులు పాటు కాల్పుల విరమణకు ఒప్పందం కుదిరినట్లు అమెరికాతో కలిసి సంయుక్త ప్రకటనలో వెల్లడించింది. జెడ్డాలో చర్చలు జరిపిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. కాల్పుల విరమణ ఏడ్రోజులు ఉంటుందని, దీనిని పొడిగించే అవకాశమున్నట్లు పేర్కొంది. సూడాన్ హింసలో 400 మందికి పైగా మరణించగా, లక్షలాది మంది నిరాశ్రయులైనట్లు ఐక్యరాజ్య సమితి ప్రకటించింది.

మెక్సికోలో కారు రేసర్లపై కాల్పులు - పది మంది మృతి

మెక్సికో: మెక్సికో నగరంలో జరిగిన కారు రేసు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. అక్కడ సాయుధులు దాడి చేయడంతో పది మంది మృత్యువాత పడ్డారు. మరో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. బాజా కాలిఫోర్నియాలోని ఎన్‌సెనాడాలో ఈ ఘటన చోటుచేసుకుంది. కార్ రేసింగ్‌లో పాల్గొన్న వారిపై సాయుధులు కాల్పులకు తెగబడ్డారు. చనిపోయిన వారంతా రేసర్లు అని అధికారులు వెల్లడించారు. వీరంతా తమ వాహనాలను నిలిపిన దుకాణం వద్దకు బూడిదరంగు వ్యాన్‌లో వచ్చిన దుండగులు పెద్ద తుపాకులతో కాల్పులు జరిపినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశాలు జారీచేసినట్లు మేయర్ తెలిపారు. రాష్ట్ర అటార్నీ జనరల్ రికార్డో ఇవాన్ కార్పియోశాంచెజ్ దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

మీటరంటే ముడుపులే...!

(మొదటిపేజీ తరువాయి)

తాఖీదులు ఇవ్వడంతో ఆందోళన చెందిన వినియోగదారులు బేరసారాలాడి తగ్గించాలని వారిని ప్రాథేయపడవలసిన దుస్థితి నెలకొంది. సంబంధిత భవనం వద్ద విద్యుత్ కేబుల్, కండక్టర్, విద్యుత్ స్తంభాలతో పాటు ఇతర సామాగ్రి, కిలో వాట్స్ సామర్థ్యం గల, 25 కేవీ, 40 కేవీ, 63 కేవీ, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుకు సంబంధిత భవన యజమానులు దరఖాస్తు చేసుకుంటారు. అయితే అధికారులకు ముడుపులు అందజేస్తేనే ఆగమేఘాల మీద విద్యుత్ కనెక్షన్ ఇస్తారని, లేదంటే నెలలు తరబడి తిప్పిస్తారని భవన యజమానులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కరాసలో ఓ భవన యజమాని రూ.5 లక్షల 8 వేలు ట్రాన్స్‌ఫార్మర్ కోసం డీడీ తీసి 45 రోజులైనా కేబుల్ లేదంటూ ముడుపుల కోసం అధికారులు ముప్పతిప్పలు పెట్టారు. చివరికి రూ.50 వేలు సమర్పిస్తేగానీ పని పూర్తి చేయలేదని సదరు యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మురళీ నగర్‌లో ఓ భవన యజమాని వారికి రూ.50 వేలు, మహారాణి పేటలో ఓ భవనానికి లక్ష రూపాయలు అధికారులకు ఇచ్చినట్లు సంబంధిత భవన యజమాని తెలియజేశాడు. ఇలా అడుగడుగునా ప్రతి కనెక్షన్‌లో అవినీతి విలయతాండవం చేస్తోందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇక షాపింగ్ మాల్స్, వాణిజ్య సముదాయాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలంటే లక్షల్లో ముడుపులు ఇవ్వాల్సిందేనని సంబంధిత యజమానులు చెబుతున్నారు. అలాగే చిన్న, మధ్య, తరహా పరిశ్రమలకు విద్యుత్ కనెక్షన్ కోసం అంచనాల పేరిట సంబంధిత పరిశ్రమల యజమానులకు భారీ తాఖీదు ఇవ్వడంతో యజమాని తగ్గించాలని ప్రాథేయపడటంతో ముడుపుల బేరానికి వచ్చి లక్షల్లో ఇవ్వాలని అధికారులు చెబుతున్నట్లు అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విశాఖ నగర శివారు ప్రాంతాల్లో ఐస్, వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్, టింబర్ డిపోలు, రైస్ మిల్లులు, కోల్డ్ స్టోరేజ్‌లు, ఇటుక బట్టీలు వంటి చిన్న చిన్న పరిశ్రమల ఏర్పాటుకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు కోసం భారీగా ముడుపులు ఇవ్వాల్సిందేనని పరిశ్రమల యజమానులు వాపోతున్నారు. ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు కూడా విస్తరించి ఉన్నాయి. ప్రభుత్వ ఆక్రమిత స్థలాల్లో విద్యుత్ కనెక్షన్ల కోసం భారీ ఎత్తున ముడుపులు దండుకుంటున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. చివరికి పేదలు వేసుకునే గుడిసెలు, రేకుల షెడ్ల ఇళ్లకు విద్యుత్ మీటర్ కనెక్షన్ ఇవ్వాలంటే కనీసం 10 వేల రూపాయలకు పైబడి ముడుపులు ఇవ్వాల్సిందేనని పేదలు లబోదిబోమంటున్నారు. ఇటీవల గోపాలపట్నం ప్రాంతానికి చెందిన ఓ తాపీ మేస్త్రి తాను ఇల్లు కట్టుకుని మీటర్ కోసం కరెంట్ ఆఫీస్‌కు వెళ్లి దరఖాస్తు చేశాడు. అయితే మీటర్ వేయడానికి వచ్చిన ఉద్యోగి రూ.15 వేలు డిమాండ్ చేయగా, 12 వేలు సమర్పించుకున్నట్లు ఆయన తెలిపారు. భీమిలి, ఆనందపురం, మధురవాడ, కొమ్మది, పెందుర్తి, గాజువాక, ఆరిలోవ, సాగర్ నగర్, ఎండాడ, సింహాచలం వంటి కొండ వాలు ప్రాంతాల్లో విద్యుత్ మీటర్ కనెక్షన్ కోసం మరింత డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకోపక్క నగర శివారు ప్రాంతాల్లో అధికంగా భవన నిర్మాణరంగం విస్తరిస్తున్న నేపథ్యంలో అపార్ట్‌మెంట్‌కు కావలసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు లక్షల్లో ముడుపులు ఇవ్వాల్సిందేనని సంబంధిత భవన యజమానులు ఆరోపిస్తున్నారు.

విజిలెన్స్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టకపోవడంతోనే కొంతమంది అధికారుల అవినీతికి అడ్డూఅదుపు లేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా అనకాపల్లి ఏఈడీ రాంబాబు ఇంటిపై ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించిన నేపథ్యంలో కోట్లాది రూపాయలు అక్రమాస్తులు వెలుగులోకి వచ్చాయి. సంస్థకు రావాల్సిన ఆదాయానికి గండి కొట్టి, అధికారులు ఇష్టారాజ్యంగా దోచేస్తున్నారని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. విజిలెన్స్ అధికారులు ప్రతి విద్యుత్ కనెక్షన్ మంజూరుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపడితే అనేక విషయాలు వెలుగులోకి వస్తాయని విద్యుత్ వినియోగదారులు అంటున్నారు.

మాతో కలిసిరండి

విపక్షాల మద్దతు కూడగట్టే పనిలో కేజ్రీవాల్

రేపటి నుంచి మమత, పవార్, ఉద్ధవ్‌తో వరుస భేటీలు

న్యూఢిల్లీ: ఢిల్లీలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కు కేంద్రప్రభుత్వానికి మధ్య అధికార పోరు కొనసాగుతోంది. స్థానిక ప్రభుత్వానికే సర్వాధికారాలు అంటూ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుతో ఈ వివాదానికి తెరపడింది. ఆప్ ప్రభుత్వం కూడా న్యాయస్థానం తీర్పు ప్రకారం చర్యలు చేపట్టింది. కానీ కేంద్రం ఆప్ పాలనకు అడ్డుతగిలింది. దీంతో తన పోరాటానికి మద్దతివ్వాలని అన్ని ప్రతిపక్ష పార్టీలను ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కోరుతున్నారు. ఆయా పార్టీల అధినేతలతో వరుస భేటీలకు సిద్ధమయ్యారు. ఈ వారంలో టీఎంసీ, శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ అధినేతలతో భేటీ కానున్నారు. మంగళవారం కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీని కలుస్తానని ఆయన విలేకరులతో చెప్పారు. బుధవారం ముంబైలో మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రేను, గురువారం ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్‌ను కలుస్తానన్నారు. కేంద్రం శుక్రవారం ఒక ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చిందని గుర్తుచేస్తూ దీనిపై ఆరు నెలల్లోగా ఆర్డినెన్స్‌ను పార్లమెంటు తేవాలని, ఇదే క్రమంలో ఓ బిల్లును ఉభయ సభల్లో కేంద్రం ప్రవేశపెట్టాల్సి వస్తుందని, రాజ్యసభలో అది వీగిపోయేలా చేస్తే 2024 లోక్‌సభలో ఓటమి తప్పదని బీజేపీకి స్పష్టమవుతుందని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ఇది సెమీఫైనల్ అవుతుందని కేజ్రీవాల్ చెప్పారు. అన్ని ప్రతిపక్షాల అధ్యక్షులను వ్యక్తిగతంగా కలిసి ఈ బిల్లు నిర్వీర్యానికి మద్దతివ్వాలని కోరతానన్నారు. అందరితో మాట్లాడాలని నితీశ్‌కుమార్‌ను కోరినట్లు కేజ్రీవాల్ చెప్పారు.

బీహార్ సీఎం నితీశ్‌కుమార్, ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ అంతకుముందు కేజ్రీవాల్‌తో ఆయన నివాసంలో భేటీ అయి ఆయనకు సంపూర్ణ మద్దతును ప్రకటించారు. మిగతా విపక్ష నేతలను ఒప్పించేందుకు తన వంతు కృషిచేస్తానని నితీశ్ ఆయనకు హామీనిచ్చారు.

న్యాయవ్యవస్థకు అవమానకరం: అఖిలేశ్

లక్నో: ఢిల్లీ పరిపాలనకు అడ్డుతగలడమే కాకుండా కీలక అధికారాలను తన వద్ద పెట్టుకునే విధంగా కేంద్రప్రభుత్వం వ్యవహరించడం ఆక్షేపణీయమని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. దేశ రాజధానిలో సేవలపై కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్... న్యాయవ్యవస్థకు అవమానకరమని, దానిని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మద్దతు ప్రకటించారు. 'ఢిల్లీ ఆర్డినెన్స్ న్యాయవ్యవస్థకు అవమానకరం. బీజేపీ ప్రతికూల రాజకీయాల పర్యవసానమే ఇది. లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలోని అన్ని స్థానాల్లో ఓటమి తప్పదని బీజేపీకి తెలుసు కాబట్టే ప్రజలపై ప్రతీకారాన్ని తీర్చుకుంటోంది. ఆర్డినెన్స్ పేరిట ప్రజాతీర్పును ఖూనీ చేస్తోంది' అని అఖిలేశ్ ట్వీట్ చేశారు.

బంగారం వైపు పరుగులు...!

(మొదటిపేజీ తరువాయి)

(ఆర్‌బీఐ) రూ.2 వేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. అయితే అలాంటి నోట్లను ఖాతాల్లో డిపాజిట్ చేయడానికి లేదా బ్యాంకుల్లో మార్చుకోవడానికి సెప్టెంబరు 30 వరకు ప్రజలకు సమయం ఇచ్చింది. తక్షణమే రూ.2 వేల నోట్లను జారీ చేయడాన్ని నిలిపివేయాలని బ్యాంకులను కోరింది. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ), బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్) హాల్‌మార్క్‌ల అమలు ఆభరణాల తయారీదారులను వ్యవస్థీకృతంగా, అధికారిక వ్యాపారాన్ని నిర్వహించడానికి ప్రోత్సహించిందని మెహ్రా అన్నారు. 'సాధారణంగా పెద్ద విలువ కలిగిన కరెన్సీ నోట్లను నగదు రూపంలో లావాదేవీలు చేయవలసి ఉంటుంది. ఇది ఇప్పుడు భారతదేశ ఆభరణాల పరిశ్రమలో చాలా తక్కువగా మారింది. వినియోగదారులు డిజిటల్ లావాదేవీల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అందువల్ల రూ.2 వేల నోట్ల ఉపసంహరణ భారతదేశ బంగారం, ఆభరణాల వ్యాపారంపై పెద్దగా ప్రభావం చూపదు' అని ఆయన తెలిపారు. అయితే చాలా మంది ఆభరణాల రిటైలర్లు శనివారం బంగారాన్ని రూ.2 వేల నోట్లకు వ్యతిరేకంగా విక్రయించారు. అది కూడా అధిక ధరకు విక్రయించారు. పీఎన్‌జీ జ్యుయలర్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ గాడ్గిల్ మాట్లాడుతూ అధిక రేటుతో బంగారానికి బదులుగా రూ.2 వేల నోట్లను తీసుకునే విధానం అసంఘటిత రంగంలో మాత్రమే ఉంటుంది. వ్యవస్థీకృత ఆభరణాల వ్యాపారులు అలాంటి వాటికి మైళ్ల దూరంలో ఉంటారు' అని తెలిపారు. నేమిచంద్ బమాల్వా అండ్ సన్స్ భాగస్వామి బచ్‌రాజ్ బమాల్వా మాట్లాడుతూ 'కొన్ని విచారణలు ఉన్నాయి. కానీ బంగారం కొనుగోలుకు ఎటువంటి రద్దీ లేదు. ఇది రేపటి నుంచి పెరుగుతుంది' అని అన్నారు.

బంగారం వ్యాపారులు ఆదాయపు పన్నుతో పాటు మనీలాండరింగ్ చట్టాల ప్రకారం కేవైసీ నిబంధనలకు అనుగుణంగా బంగారాన్ని విక్రయిస్తున్నారని ఆయన చెప్పారు. కామ్‌ట్రెండ్జ్ రీసెర్చ్ సహ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ జ్ఞానశేఖర్ త్యాగరాజన్ మాట్లాడుతూ నోట్ల రద్దు ప్రజలను ఎప్పుడూ బంగారం వైపు నడిపించిందని అన్నారు. అయితే, ఈసారి చాలా తేడా ఏమిటంటే, చాలా ఫిర్యాదులు ఉన్నాయని అన్నారు. 2016లో రూ.500, రూ.1,000 నోట్ల రద్దుకు భిన్నంగా, 2018-19లో ఆర్‌బీఐ వాటి ముద్రణను నిలిపివేసినందున, రూ.2,000 నోట్లను కలిగి ఉన్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. అవి చాలా అరుదుగా చెలామణిలో ఉన్నాయి. రూ.2 లక్షల లోపు బంగారం, వెండి, ఆభరణాలు లేదా విలువైన రత్నాలు, రాళ్ల కొనుగోలుకు శాశ్వత ఖాతా సంఖ్య (పాన్) లేదా కొనుగోలు ఆధార్ తప్పనిసరి కేవైసీ పత్రం అవసరం లేదు.

రాష్ట్రపతి చేయాలి... ప్రధాని కాదు

కొత్త పార్లమెంటు ప్రారంభోత్సవంపై రాహుల్

న్యూఢిల్లీ: పార్లమెంటు కొత్త భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించాలని, ప్రధాని కాదని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ఈనెల 28న పార్లమెంటు నూతన భవనాన్ని ప్రధాని మోదీ ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయన శనివారం ట్విట్టర్‌లో స్పందించారు. 'కొత్త పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించాలేగానీ ప్రధానమంత్రి కాదు' అని పేర్కొన్నారు. 28వ తేదీ హిందూత్వ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్ జయంతి కావడం, అదేరోజు పార్లమెంటు భవనం ప్రారంభోత్సవం ఉండటాన్ని విపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శించాయి. దేశ వ్యవస్థాపకులను మోదీ ప్రభుత్వం పూర్తిగా అవమానించిందని కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తంచేసింది. 2020, డిసెంబరు 10న పార్లమెంటు భవనానికి మోదీ శంకుస్థాపన చేశారు. లోక్‌సభ చాంబర్‌లో 888 మంది, రాజ్యసభ చాంబర్‌లో 300 మంది కూర్చునేందుకు వీలుగా భవన నిర్మాణం జరిగింది. ఉభయ సభలు సమావేశమప్పుడు లోక్‌సభ చాంబర్‌లో 1,280 మంది సభ్యులు కూర్చోవచ్చని లోక్‌సభ సెక్రటేరియట్ పేర్కొంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా గురువారం ప్రధాని మోదీని కలిసి కొత్త పార్లమెంటు భవనాన్ని ప్రారంభించేందుకు ఆహ్వానించినట్లు వెల్లడించింది.

ప్రచార కాంక్షతోనే మోదీ చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

ట్వీట్లలో పేర్కొన్నారు. పార్లమెంటు భవనాన్ని అసలు ప్రధాని ఎందుకు ప్రారంభించాలి, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ ప్రారంభించవచ్చు కదా అని ఒవైసీ ప్రశ్నించారు. ప్రజల డబ్బుతో నిర్మించిన పార్లమెంటు భవనాన్ని తన 'మిత్రులు' సొంత డబ్బుతో కట్టించినట్లుగా మోదీ భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. హిందూత్వ సిద్ధాంతకర్త సావార్కర్ జయంతి రోజున పార్లమెంటు ప్రారంభోత్సవాన్ని పెట్టడంతో దేశనిర్మాతలను ఘోరంగా అవమానించారని విపక్షాలు విమర్శించాయి.

నిన్న వాతలు... నేడు కోతలు

(మొదటిపేజీ తరువాయి)

అత్యధికంగా 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రతతో పాటు వడగాడ్పులు, ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీంతో ఫ్యాన్, ఏసీ పని చేయని ఇల్లు లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండే మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ కోతలు అమలు చేస్తుండడంతో జనం అల్లాడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో లోడ్ రిలీఫ్ పేరుతో రాత్రుల పూట కూడా కరెంట్ తీస్తున్నారు.

ఒకపక్క ఉక్కపోత, మరోపక్క దోమల బెడదతో ప్రజల బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. విద్యుత్ అధికారులు మాత్రం ఈ కోతలకు సాంకేతిక సమస్యలే కారణం తప్ప అధికారికంగా ఎటువంటి కోతలు విధించడం లేదని చెపుతున్నారు. అధికార యంత్రాంగం ఇప్పటికైనా వాస్తవ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేలా తక్షణ ఏర్పాట్లు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

24న కాంగ్రెస్ కీలకభేటీ

ఎన్నికల రాష్ట్రాల నేతలను కలవనున్న ఖడ్గే

న్యూఢిల్లీ: కర్నాటకలో అఖండ విజయం అందించిన కొత్త జోష్‌తో కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకుంటోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీపై పోటీచేసి గెలవాలని ఆకాంక్షిస్తోంది. ఇందుకోసం మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు వ్యూహాలను సిద్ధం చేసుకునే పనిలో పడింది. ఇదే క్రమంలో 24వ తేదీన రాష్ట్ర స్థాయి నాయకుల సమావేశాన్ని నిర్వహిస్తోంది. ఆయా రాష్ట్రాల నాయకులతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే వేర్వేరుగా భేటీ అయి స్థానిక పరిస్థితులు, పార్టీ కార్యాచరణను చర్చిస్తారు. తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ గుండా భారత్ జోడో యాత్ర సాగిందని, కర్నాటక మాదిరిగానే ఆయా రాష్ట్రాల్లో పార్టీకి ఇది లబ్ధి చేకూరుస్తుందని ఓ సీనియర్ నేత విశ్వాసం వ్యక్తంచేశారు. కర్నాటక, హిమాచల్‌లో 'ఉచిత' వ్యూహం ఫలించిన క్రమంలో మిగతా రాష్ట్రాల్లోనూ దానిని అనుసరించే యోచనలో కాంగ్రెస్ ఉన్నట్లు తెలిసింది.

మోదీ ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా

బీబీసీ చిత్ర ప్రదర్శన

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే వారంలో ఆస్ట్రేలియాలో పర్యటించనున్న సందర్భంగా భారత్ పై బీబీసి రూపొందించిన డాక్యుమెంటరీ ఆస్ట్రేలియా పార్లమెంటులో ప్రదర్శించనున్నారు. మోదీ హయాంలో రాజ్యాంగ మౌలిక సూత్రాలను ఉల్లంఘించడం బాగా పెరిగిపోయిందని ఆందోళ పడుతున్న ఆస్ట్రేలియాలోని ప్రవాస భారతీయులు ఈ డాక్యుమెంటరీని ప్రదర్శించనున్నారు. ఆస్ట్రేలియాలో ప్రైవేటు సంస్థలకు ఇలాంటి కార్యక్రమాలకు అనుమతి ఇస్తుంటారు. ఈ ప్రదర్శన నిర్వహించడంలో అంతర్జాతీయ క్షమా సంస్థకు కూడా పాత్ర ఉంది. అంతర్జాతీయ క్షమా సంస్థతో పాటు ఆస్ట్రేలియాలోని హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్, న్యూజిలాండ్ అండ్ ముస్లిం కలెక్టివ్కు కూడా బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శించడంలో భాగస్వామ్యం ఉంటుంది. ఆస్ట్రేలియాలోని పెరియార్-అంబేద్కర్ థాట్ సర్కిల్, ది హ్యూమనిజం ప్రాజెక్ట్, సెంటర్ ఫర్ కల్చర్-సెంటర్డ్ అప్రోచ్, రెసర్చ్ అండ్ ఎవాల్యూయేషన్ కూడా ఈ ప్రదర్శనలో భాగస్వాములవుతున్నాయి.

మోదీ సోమవారం నుంచి ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్నారు. కాన్ బెర్రాలో ఈ డాక్యుమెంటరీ ప్రదర్శించే సమయానికి ఆయన పర్యటన దాదాపు ముగుస్తుంది. బీబీసీ డాక్యుమెంటరీ 2002 లో గుజరాత్ మారణ కాండకు సంబంధించింది. ఈ డాక్యుమెంటరీ ప్రదర్శించిన తరవాత చర్చా కార్యక్రమం కూడా ఉంటుంది. ఇందులో జైలులో ఉన్న గుజరాత్ పోలీసు ఉన్నతాధికారి సంజీవ్ భట్ కూతురు ఆకాశీ భట్, అంతర్జాతీయ క్షమా సంస్థ భారత్ అధ్యక్షుడు ఆకార్ పటేల్ పాల్గొంటారు.

మోదీ మూడు రోజులపాటు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నా సిడ్నీలో మాత్రమే గడుపుతారు. వివిధ దేశాలలో ఉన్న పంజాబీ, కశ్మీరీలు, ముస్లింలు, సిక్కులు, మానవహక్కుల పరిరక్షకులు భారత్‌తో నెలకొన్న పరిస్థితిపై ఆందోళనగా ఉన్నారు.

ఈ'సారీ' రాలేను

(మొదటిపేజీ తరువాయి)

ఉండిపోయారు. ఈ నేపథ్యంలో సోమవారం విచారణకు రావాలంటూ సీబీఐ మరోసారి నోటీసు ఇవ్వగా, ఈసారి కూడా రాలేనంటూ లేఖ పంపారు. అయితే దీనిపై సీబీఐ తీవ్రంగా స్పందిస్తూ, సోమవారం ఎట్టిపరిస్థితుల్లో హాజరుకావాల్సిందేనంటూ స్పష్టం చేసినట్లు తెలిసింది.

నేడు గుల్‌మార్గ్‌లో జీ20 సదస్సు

న్యూఢిల్లీ: జమ్మూ -కశ్మీర్‌లోని గుల్‌మార్గ్‌లో సోమవారం నుంచి నిర్వహించనున్న జీ20 టూరిజం వర్కింగ్ గ్రూప్ సమావేశాల్లో అత్యవసరంగా భద్రతాపరమైన మార్పులు చేశారు. ఈ సమావేశమే లక్ష్యంగా పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ ప్రేరేపిత ఉగ్రవాదులు 26/11 తరహా దాడులకు పన్నాగం పన్నినట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో ఈ మేరకు చివరి నిమిషంలో కీలక మార్పులు చేశారు. మే 22 నుంచి 24వరకు ఈ సదస్సు జరగనుంది. భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని అధీనంలోకి తీసుకొని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాయి. తనిఖీల్లో భాగంగా అనుమానం వచ్చి ఐఎస్ఐ ఉగ్రవాదుల కోసం పని చేస్తున్న వ్యక్తి ని భద్రతాబలగాలు అదుపులోకి తీసుకొని ప్రశ్నిం చాయి. సదస్సు నిర్వహించనున్న కన్వెన్షన్ సెంటర్ లోనే ఆ వ్యక్తి ఉద్యోగం చేస్తున్నాడు. అతడు చెప్పిన వివరాలను బట్టి ఉగ్రవాదులు భారీ దాడులకు పాల్పడేందుకు అవకాశం ఉన్నట్లు తెలుసుకున్న బలగాలు ఆగమేఘాల మీద భద్రతాచర్యల్లో మార్పులు చేపట్టాయి. ముంబై దాడుల తరహాలో కొందరు ఉగ్రవాదులు సదస్సు జరిగే ప్రాంతంలోకి చొరపడి కాల్పులు జరిపేందుకు పన్నాగం పన్నినట్లు తెలుస్తోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో గుల్‌మార్గ్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

సమస్యల పరిష్కారానికి

రోడ్డెక్కిన సచివాలయ ఉద్యోగులు

- ప్రభుత్వ ఉత్తర్వులు సక్రమంగా అమలు చేయాలి
- అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: సమస్యల పరిష్కారానికి గ్రామ సచివాలయం ఉద్యోగులు రోడ్డెక్కారు. గ్రామ, వార్డు సచివాలయంలో పని చేస్తున్న వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు ఆదివారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద 'జగనన్నకు చెబుదాం' సదస్సు నిర్వహించారు. రాష్ట్రంలోని 26 జిల్లాలలో పని చేస్తున్న దాదాపు వెయ్యి మందికి పైగా సిబ్బంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్యను అసోసియేషన్ గౌరవ అధ్యక్షునిగా ఎన్నుకుని సత్కరించారు. అనంతరం ఈశ్వరయ్య ప్రసంగిస్తూ వీరి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవ చూపాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాపితంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాజకీయ నిర్ణయమైన చెత్త సేకరణ పన్నుపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్న తరుణంలో వారు పన్ను కట్టకపోతే సెక్రటరీలను మీ జీతంలో నుంచి కట్టాలని వేధించడం ఎంతవరకు సబబో ఆలోచిం చాలన్నారు. వీరికి సంబంధం లేదని పారిశుధ్య పనులను అప్పగించి, కేవలం మేస్త్రిలాగా పనులు చేయిస్తూ, జాబ్ చార్ట్‌ను అమలు చేయకుండా వేధిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు సాంకేతిక సేవలైన జనన-మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్, మ్యారేజ్ సర్టిఫికెట్ జారీ, ఎన్విరాన్‌మెంట్ విధులు అయిన ప్లాస్టిక్ నియంత్రణ, ఫుడ్ సేఫ్టీ చెకింగ్ విధులు వెంటనే కేటాయించి వారి ఆత్మ గౌరవాన్ని కాపాడాలని కోరారు. అందుకే జగనన్నకు తమ గోడు వెళ్లబోసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న వేలాది మంది సెక్రటరీలు విజయవాడ ధర్నా చౌక్‌కు వచ్చారని ఈశ్వరయ్య తెలిపారు. వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు జూన్ 1 నుంచి సచివాలయం సమయపాలన పాటిస్తారని, కమిషనర్‌లు సస్పెండ్ చేస్తే, వారి మీద కోర్టులో పోరాడతామని హెచ్చ రించారు. జీఓ నంబరు 650 ప్రకారం సచివాలయం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు సమయపాలన అమలు చేయాలని, సీడీఎమ్ఏ ఇచ్చిన సెలవుల ఉత్తర్వులు అన్ని మున్సిపాలిటీలలో అమలు చేయాలని, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కమిషనర్‌ల వేధింపులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా సెక్రటరీలపై వేధింపులు ఆపాలని, ఇప్పటి వరకు ఇచ్చిన సస్పెన్షన్ ఉత్తర్వులను బేషరతుగా ఎత్తివేయాలని, చెత్త పన్ను విష యంలో వేధింపులు ఆపాలని కోరారు, శానిటరీ ఇన్‌స్పె క్టర్‌లను రిపోర్టింగ్ ఆఫీసర్‌గా తొలగించి, వారిని ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ లేదా కమిషనర్‌ను రిపోర్టింగ్ ఆఫీసర్‌గా పెట్టాలని కోరారు. సదస్సులో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో కమిషనర్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు వేధిస్తున్న తీరుపై ధ్వజమెత్తారు. సెలవుల జీవోను అమలు చేయకుండా ఉద్యోగుల ప్రాథమిక హక్కులను కాలరాస్తూ, రోజుకు 10 నుంచి 14 గంటల పని చేయిస్తూ, కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ, వారిని వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. మహిళలు, గర్భిణులు అని కూడా చూడకుండా సమయపాలన అమలు చేయకుండా సస్పెన్షన్‌ల పేరుతో హింసిస్తున్నారని, అటువంటి అధికా రులపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పాల్గొని సంఘీభావం తెలిపి మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి అండగా ఉండాలని అన్నారు. చట్ట సభల్లో కమ్యూనిస్టులు లేని కొరత కనిపిస్తోందని అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకులు శివ ఆదిమూర్తి, పార్థసారథి, పార్వతి, సృజన, పి.శ్రీకాంత్, గణేష్, నవీన్ కుమార్, గంట రామకృష్ణ, శ్యామ్, వెంకటేష్, మాధురి, బోయిన తిరుమలరావు, పవన్ కుమార్, హేమేష్ అహర్ని పాల్గొన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు, విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్, యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు లంక గోవింద రాజులు, నగర ఉపాధ్యక్షుడు లంకె సాయి తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఎంతవరకు నెరవేరుస్తారో చూస్తాం

అన్నమయ్య డ్యామ్ బాధితులపై పవన్ కల్యాణ్ ట్వీట్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ తీరుపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ మరోసారి విమర్శల బాణం ఎక్కుపెట్టారు. అన్నమయ్య డ్యామ్‌పై ప్రభుత్వ నిర్లక్ష్యం, మోసాలను వివరిస్తూ ఆయన ఆదివారం వరుస ట్వీట్లు చేశారు. అన్నమయ్య డ్యామ్ బాధితులకు నెలరోజుల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడంపై విచారకరమన్నారు. ప్రభుత్వ తీసుకునే చర్యలు మోకాలడ్డేలా, కంటి తుడుపులా ఉండబోవని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ఎంతవరకు నెరవేరుతుందో తెలియాలంటే మరో నెల రోజులు ఆగాల్సిందేనని, అప్పటివరకు జనసేన నిరీక్షిస్తుందని తెలిపారు. వరద బాధితులకు నెలలో ఇళ్ల నిర్మాణమని ప్రభుత్వం ఇచ్చిన హామీపై మీడియాలో వచ్చిన కథనాన్ని దీనికి ట్యాగ్ చేశారు. "గతంలో భారీ వర్షాలకు అన్నమయ్య డ్యామ్ మట్టికట్ట తెగింది. భారీగా వచ్చిన వరదల వల్ల అనేక మంది జల సమాధి అయ్యారు. ఈ ఘటనపై సీఎం జగన్ వేసిన ఉన్నతస్థాయి కమిటీ ఏమైందో? ఆయన ఏం చర్యలు తీసుకున్నారో దేవుడికే ఎరుక. ఏడాదిలో డ్యామ్‌ను పునర్నిర్మిస్తామన్న హామీ ఏమైంది? రివర్స్ టెండరింగ్ పేరుతో అస్మదీయుడు పొంగులేటికి పనులు అప్పజెప్పారు. 18 నెలలవుతున్నా నేటికీ అక్కడ వీసమెత్తు పనులు చేయలేదు" అని పవన్ విమర్శించారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విరమించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇప్పుడు గృహ వినియోగ కనెక్షన్లకు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు బిగించడానికి పూనుకోవడం గర్హనీయమన్నారు. దీనివల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందనీ, ప్రభుత్వం ఈ ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వినియోగదార్ల నుంచి ముక్కుపిండి విద్యుత్ ఛార్జీలు వసూలు చేయడానికి, అదనపులోడ్, పీక్ డిమాండ్ పేరిట దొడ్డిదారిన వడ్డించడానికి అన్ని కనెక్షన్లకూ స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు బిగించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి చర్యకు పాల్పడడం తగదన్నారు. నెలకు 200 యూనిట్లు పైబడి వాడే గృహ వినియోగ కనెక్షన్లకు తొలి దశలోనూ, మిగతా వారికి రెండో దశలోనూ ప్రీపెయిడ్ మీటర్లు బిగించనున్నట్లు, అందుకు అదానీ కంపెనీకి టెండర్ ఖరారు కానున్నట్లు వార్తలొస్తున్నాయి. వినియోగదార్ల జేబుకు చిల్లు పెట్టి అదానికి కట్టబెట్టే యోచన ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించు కోకపోతే ప్రజల నుంచి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని శ్రీనివాసరావు హెచ్చరించారు.

పేదల ఇళ్లు ప్రచార ఆర్భాటమే

75 శాతం పునాదులకే పరిమితం : టీడీపీ నేత కొమ్మారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భారీఎత్తున ప్రచారం చేసుకుంటున్న 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమం బహిరంగ సభలు, పత్రికల్లో ప్రకటనలకే పరిమితమైంది తప్ప క్షేత్రస్థాయిలో ఎక్కడా కార్యరూపం దాల్చడం లేదని, ప్రజలకు మంచి జరిగితే స్వాగతిస్తామని, కానీ సంక్షేమ కార్యక్రమాల ముసుగులో జరిగే దోపిడీని తెలుగుదేశం పార్టీ కచ్చితంగా ప్రశ్నిస్తుందని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ స్పష్టం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18న గృహ నిర్మాణ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా గృహ నిర్మాణ స్థితిగతులపై ముఖ్యమంత్రికి ఇచ్చిన నివేదిక, జగన్‌మోహన్‌రెడ్డి ఆర్భాటంగా అమలు చేస్తున్న ఇళ్ల పథకంలోని లొసుగుల్ని బయటపెట్టిందన్నారు. సీఎం జగన్ చెబుతున్న పేదలకు ఇళ్లు పథకం ప్రచారంలో ఘనం... పనిలో అథమం అన్నట్టు తయారైందని ఆయన విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 75 శాతం ఇళ్లు నేటికీ పునాదుల దశలోనే ఉన్నాయని అన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్, అర్బన్ పథకాల కింద ఆర్భాటంగా ప్రారంభించిన ఇళ్ల పథకాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రచారానికి పరిమితం చేశారని ఆరోపించారు. ఐదేళ్లలో 30 లక్షల ఇళ్లు నిర్మిస్తానన్న సీఎం, తొలిదశలో గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో ప్రారంభించిన 18,63,603 ఇళ్లలో నేటికీ దాదాపు 75 శాతం ఇళ్లు పునాదుల దశ కూడా దాటలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 1,79,060 ఇళ్ల నిర్మాణం ప్రారంభించి, 4 ఏళ్లలో 459 ఇళ్లే పూర్తిచేయడం సిగ్గుచేటు కాదా అని ప్రశ్నించారు. అలాగే గ్రామీణ ప్రాంత ఇళ్ల నిర్మాణంలో 82.6 శాతం ఇళ్లకు కనీసం పునాదులు కూడా పడలేదన్నారు. దాదాపు రూ.10 వేల కోట్లకు పైబడి గత ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే గృహ నిర్మాణానికి ఖర్చు చేసినట్లు సీఎం చెబుతున్నదంతా కూడా బూటకమన్నారు. ప్రభుత్వ నివేదికల ప్రకారం, జగన్ సర్కారు గత నాలుగేళ్లలో గృహ నిర్మాణానికి చేసిన మొత్తం ఖర్చు రూ.11,895 కోట్లు మాత్రమేనన్నారు. వీటిలో కూడా దాదాపు 90 శాతం (రూ.10,693 కోట్లు) కేంద్రం ఇచ్చిన నిధులేనని, రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్లకు తనవంతుగా చేసిన ఖర్చు కేవలం రూ.1,960 కోట్లు మాత్రమేనని పట్టాభి వివరిం చారు. ఇప్పటికైనా ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటనలు నమ్మి మోసపోకుండా వాస్తవ పరిస్థితులు గ్రహించాలని కోరారు.

ఎగువ భద్రతో రాయలసీమకు ముప్పు

జగదీశ్ ఆందోళన

విశాలాంధ్ర - గుంతకల్లు: ఎగువ భద్ర ప్రాజెక్టు వల్ల బళ్లారి జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాలకు తీవ్ర నష్టం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీశ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే తుంగభద్ర, హంద్రీనీవా కాలువలకు నీరు వచ్చే పరిస్థితి ఉండదన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ఏర్పడే పరిస్థితులను చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు ఈ నెల 25న జిల్లా రైతు సంఘం ఆధ్వ ర్యంలో అనంతపురంలో సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలి పారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 22, 23 తేదీలలో విజయవాడలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గం, కార్యవర్గ సమావేశాలు జరగనున్నాయని తెలిపారు. ఈ సమావేశాలలో అభివృద్ధి నిరోధక, ప్రజా వ్యతిరేక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపేందుకు, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకోవడానికి, రాష్ట్రంలో పార్టీ అనుసరించాల్సిన రాజకీయ వ్యూహం, బీజేపీ, వైసీపీలకు వ్యతిరేక ఫ్రంట్‌పై చర్చిస్తామన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం కూటమిగా ఏర్పడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని అన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవింద్, నియోజవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈశ్వరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేంద్ర, సీపీఐ నాయకులు ఉమ్మర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

నిందితుడిని కొట్టి చంపిన గ్రామస్థులు

గుర్రంకొండ: అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలో దారుణం చోటుచేసుకుంది. టి.పసలవాండ్లపల్లి పంచాయతీ ఉదారవాండ్లపల్లికి చెందిన బాలిక (13)పై అదే గ్రామానికి చెందిన ముత్తన్న(43) అత్యాచారానికి పాల్పడి కత్తితో దాడి చేసి గాయపర్చాడు. తీవ్ర గాయాలు కావడంతో బాలిక ప్రాణాపాయ స్థితిలో ఉంది. స్థానికులు ఆమెను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలిక స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆదివారం సాయంత్రం సమీప పొలాల్లో ఆవులు మేపుతుండగా ముత్తన్న ఈ దారుణానికి ఒడిగట్టాడు.

ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు మూకుమ్మడిగా నిందితుడిపై దాడికి దిగారు. రాళ్లు, కర్రలతో ఇష్టమొచ్చినట్టు కొట్టడంతో ముత్తన్న అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుడు ముత్తన్న గతంలో భార్యను చంపి ఏడేళ్లు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవించాడు. రెండేళ్ల క్రితమే జైలు నుంచి విడుదలయ్యాడు. తరచూ గ్రామంలో కత్తి పట్టుకొని తిరుగుతూ అందర్నీ బెదిరించేవాడని స్థానికులు చెబుతున్నారు.

ఏపీలో టీడీపీ, వైసీపీలకు బీఆర్ఎస్ ప్రత్యామ్నాయం

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవంలో తోట చంద్రశేఖర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ, టీడీపీలకు బీఆర్ఎస్ ప్రత్యామ్నాయమని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తోట చంద్రశేఖర్ తెలిపారు. ఆంధ్ర ప్రజలను ఆ రెండు పార్టీలు మోసగించాయని విమర్శించారు. గుంటూరు నగరం ఆటోనగర్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయాన్ని తోట చంద్రశేఖర్ ఘనంగా ప్రారంభించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, వైసీపీ రాష్ట్రాన్ని అథోగతి పాలు చేస్తున్నాయని, టీడీపీ వైఫల్యాలతో విసుగెత్తిన ప్రజలకు మరే ప్రత్యామ్నాయం లేక వైసీపీకి ఓటు వేశారన్నారు. 31 మంది ఎంపీలు ఉన్న వైసీపీ ప్రత్యేక హోదాపై కేంద్రాన్ని నిలదీసిన దాఖలాలు లేవని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేస్తుంటే 31 మంది ఎంపీలు ఉండి ఏం మాట్లాడలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారని ఎద్దేవా చేశారు. మోదీ అంటే జగన్‌కు కేసుల భయమని, చంద్రబాబు బీజేపీతో పొత్తు కోరుకుంటున్నారని, ఈ నేపథ్యంలో మోదీకి ఇబ్బంది కలిగించే ఏ పని చేయడని విమర్శించారు. కానీ మోదీని దీటుగా ఎదుర్కోగల దమ్మున్న నాయకుడు కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ ఒక్క తెలంగాణ, ఏపీ, మహారాష్ట్రకే కాకుండా దేశం మొత్తానికి నాయకత్వం వహించగల ధీరోదత్తుడని కొనియాడారు. ఏపీకి బీఆర్ఎస్ తరపున ఏపీకి చెందిన వారే సీఎం అవుతారనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ప్రైవేటు పరం చేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను కేసీఆర్ ప్రధాని కాగానే వాటిని తిరిగి వెనక్కి తీసుకుంటామని బహిరంగంగా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ మోడల్ అభివృద్ధిని ఏపీ ప్రజలు కోరుకుంటున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ రాకతో టీడీపీ, వైసీపీలకు ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. రానున్న కాలంలో బీఆర్ఎస్ ఏపీలో రాజకీయాల్లో కీలక పాత్ర పోషించనుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా రూపొందించడంలో కేసీఆర్, కేటీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని, కానీ ఏపీలో ఒక్క నగరం కూడా అభివృద్ధి చేయడం లేదన్నారు. ఏపీకి సమర్థ నాయకత్వం లేకపోవడం వల్లనే అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయని తెలిపారు. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణకు పెట్టుబడుల ప్రవాహం

అమెరికాలో కేటీఆర్‌ను కలిసిన అనేక సంస్థల ప్రతినిధులు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉన్నదని అమెరికా పర్యటనలో భాగంగా కలిసిన కంపెనీలతో రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు తెలిపారు. రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వ ప్రగతిశీల విధానాలను వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కేటీఆర్ అమెరికా పర్యటనలో రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతున్నది. దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లో తమ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ముందుకువస్తున్నాయి. బెయిన్ క్యాపిటల్ గ్రూప్‌నకు చెందిన వీఎక్స్‌ఐ గ్లోబల్ సొల్యూషన్స్, మండీ హెూల్డింగ్స్ వంటి కంపెనీలు ఆసక్తిని కనబర్చాయి. హైదరాబాద్‌లో తమ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వీఎక్స్‌ఐ గ్లోబల్ సొల్యూషన్స్ ప్రకటించింది. తద్వారా 10వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా 42 దేశాల్లో ఈ కంపెనీలు సేవలు అందిస్తున్నది. అదేవిధంగా టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు మండీ హెూల్డింగ్స్ ప్రకటించింది. హూస్టన్‌లో మంత్రి కేటీఆర్‌తో మండి హెూల్డింగ్స్ వ్యవస్థాపక చైర్మన్, సీఈవో ప్రసాద్ గుండుమోగుల సమావేశమయ్యారు. హైదరాబాద్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు ద్వారా 2వేల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. తెలంగాణలో గ్లోబల్ డెవలప్మెంట్ సెంటర్‌ను కలిగి ఉన్న స్టోరబుల్ కంపెనీ విస్తరణ ప్రణాళికలను ప్రకటించింది. జొనాథన్ లూయిస్, నీల్ వర్మల నేతృత్వంలో కంపెనీ ప్రతినిధి బృందం కేటీఆర్‌ను కలిసింది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూరప్‌లో 41,000 స్టోరేజ్ సేవలను అందిస్తున్న ఈ టెక్ దిగ్గజం హైదరాబాద్‌లో 100 మంది సాఫ్ట్‌వేర్ డెవలపర్లను నియమించుకోనుంది. రీసెర్చ్ డెవలప్‌మెంట్ కోసం నిపుణులను తీసుకోనున్నట్లు తెలిపింది. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్‌తో పాటు స్థానిక విద్యా సంస్థలతో కలిసి పనిచేస్తామని పేర్కొంది. ఇదిలావుంటే, హైదరాబాద్‌లో త్వరలో జరిగే డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవానికి రైట్ సాఫ్ట్ వేర్ కంపెనీ ప్రతినిధి బృందం మంత్రి కేటీఆర్‌ను ఆహ్వానించింది. ఈ కొత్త సెంటర్ ద్వారా 500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్రంలోని విద్యాసంస్థలతో కంపెనీకి భాగస్వామ్యం ఏర్పడుతుంది. తెలంగాణలోని ద్వితీయ శ్రేణి పట్టణాల్లోనూ కార్యకలాపాలను కొనసాగిస్తామన్న రైట్ సాఫ్ట్‌వేర్ వెల్లడించింది.

కోతల విద్యుత్తు మాకొద్దు

కిరోసిన్ దీపాలే ముద్దు...! - అంధకారంలో మన్యం ప్రాంతం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: తరచుగా విద్యుత్ కోతలతో వేగలేక పోతున్న మన్యం ప్రజలు... అప్పుడప్పుడు ఉండే ఈ విద్యుత్ కన్నా కిరోసిన్ దీపమే మిన్నంటూ, కిరోసిన్ ఇప్పించండి మహాప్రభో అని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు, పాడేరు నియోజకవర్గం పరిధిలో గత కొన్ని రోజులుగా నియోజకవర్గ కేంద్రాలతో పాటు చింతపల్లి, జీకే వీధి, హుకుంపేట, దుంబ్రిగుడ, అనంతగిరి తదితర ఏజెన్సీ మండలాల్లో తరచుగా విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి. వేసవి నుంచి ఈ విద్యుత్ కోతలు మరింత పెరిగాయని, ఇక ఆయా మండలాల పరిధిలో ఎక్కడ ఒక చిన్న చినుకు పడినా మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇక మారుమూల గ్రామాలలో పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. విద్యుత్ సరఫరా నిలిచిపోయిదంటే చాలు ఎందుకు పోయిందో, మరలా ఎప్పుడు వస్తుందో ఎవరికీ తెలియని దుస్థితి. రాత్రి సమయంలో పరిస్థితి మరింత దారుణం. విద్యుత్ కోతలపై ఎవరిని సంప్రదించాలో తెలియని స్థితిలో గ్రామాల్లోని ప్రజలు ఉన్నారు. ఇది గత కొన్నేళ్లుగా అక్కడ నిత్యకృత్యంగా మారింది.

వేసవిలో ఒక రకమైన విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతుంటే, వర్షాకాలంలో గంటల తరబడి ఆయా ప్రాంతాలు పూర్తి అంధకారంలో మగ్గిపోతున్నాయి. విద్యుత్ శాఖ అధికారుల తీరుతో విసిగిపోయిన గిరిజన గ్రామాల ప్రజలు 'విద్యుత్ కోతలతో పడలేక పోతున్నాం. కిరోసిన్ ఇప్పించండి మహాప్రభో' అని వేడుకుంటున్నారు. మరికొందరైతే 'విద్యుత్ వద్దు కిరోసినే ముద్దు' అని అంటున్నారు. ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ప్రజలకు కిరోసిన్ సరఫరాను నిలిపివేసింది. ఒకప్పుడు మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు కిరోసిన్ దీపాలే వెలుగు దివ్వెలుగా నిలిచేవి. కాలాలు మారాయి. ప్రభుత్వాలు మారాయి. ప్రతీ గ్రామానికి విద్యుత్ సరఫరా అందే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అయితే అందుకు తగినట్లుగా ప్రజలకు సేవలందించడంలో మన్యంలోని విద్యుత్ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. గతకొద్ది రోజులుగా మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారు. దీంతో విద్యుత్ శాఖ అధికారుల పనితీరుతో విసిగిపోయిన ప్రజలు విద్యుత్ కోతలతో వేగలేకపోతున్నాం... కిరోసిన్ ఇప్పించండి మహాప్రభో అని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

విజయవాడలో 24న ఈయూ రాష్ట్ర మహాసభలు

వాల్‌పోస్టరును విడుదల చేసిన బొప్పరాజు, పలిశెట్టి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 24న విజయవాడ సమీపంలోని పోరంకి మురళీ రిసార్ట్స్‌లో జరుగనున్న ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ 27వ రాష్ట్ర మహాసభలకు ఉద్యోగులంతా హాజరై జయప్రదం చేయాలని ఏపీజేఏసీ అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక రెవెన్యూ భవన్‌లో ఏపీజేఏసీ అమరావతి నేతలు మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీ ఏర్పడక ముందే నిజాం ప్రభుత్వం నుంచి రవాణా రంగంలో మొట్టమొదటి కార్మిక సంఘంగా ఏఐటీయూసీకి అనుబంధ సంఘంగా ఏర్పడిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌కు 71 ఏళ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన అనంతరం ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్‌గా అవతరించి ఏపీజేఏసీ అమరావతికి అనుబంధ సంఘంగా కొనసాగుతుందన్నారు. ఈ మహాసభలో ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భవిష్యత్ ప్రణాళికలపైన, అలాగే నూతన రాష్ట్ర కమిటీ ఎంపిక జరుగనున్నట్లు వారు తెలిపారు. రాష్ట్ర మంత్రులు, ఆర్టీసీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్, ఏఐటీయూసీ రాష్ట్ర, జాతీయ నేతలు, విజయవాడ జోనల్ చైర్ పర్సన్, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు తదితరులు మహాసభకు అతిథులుగా హాజరవుతారని అన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే మా లక్ష్యం

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రిటైర్డు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై గత 73 రోజులుగా ఆందోళన చేస్తున్న ఫలితంగా ప్రభుత్వం స్పందించి కొన్ని సమస్యల పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ప్రధానంగా బకాయిపడ్డ నాలుగు డీఏలు, పీఆర్సీ ఆరియర్స్, పే స్కేల్స్, స్పెషల్ పేలు, వీఆర్ఏలకు డీఏ, పదోన్నతి పొందిన గ్రేడ్-2 వీఆర్వోలకు పే స్కేల్ ఇవ్వడం, విలీనానికి ముందు ఆర్టీసీలో పని చేస్తున్న ఉద్యోగులకు పాత సర్వీస్ రూల్స్ వర్తింప చేయడం, హోం గార్డులను ఇతర యూనిఫాం సర్వీస్ శాఖలలో విలీనం చేయడం, మిగిలిపోయిన 900 భాషా పండితుల కోసం సూపర్ న్యూమరరీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు, గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సర్వీస్ రూల్స్ సమస్యలు, వర్క్ చార్జ్ ఉద్యోగుల పేరు ఇంజనీర్ సబార్డినేట్‌గా మార్చి 010 పద్దు కింద జీతాలు, డీఆర్డీఏ ఉద్యోగులను శాఖలో విలీనం చేయడం, మునిసిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, గ్రామీణ నీటి సరఫరా విభాగంలోని ఇంజనీర్లకు డీఈ పోస్టుల మంజూరు తదితర ముఖ్య అంశాలన్నింటిపైనా స్పష్టమైన లిఖితపూర్వక ఉత్తర్వులు వస్తేనే తప్ప ఈ ఉద్యమం ఆగేది లేదని బొప్పరాజు, పలిశెట్టి స్పష్టం చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ఈ ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించినప్పటికీ, ఉద్యోగులను ప్రభుత్వం పూర్తిగా విస్మరించినందున, తప్పని పరిస్థితుల్లో ఉద్యమబాట పట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని వారు వివరించారు. ఆందోళన దశల్లో భాగంగా ఈనెల 27న ఏలూరులో జరగనున్న మూడవ ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

సాహితి

కథన శిల్పి వివిన మూర్తి

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

"ఈనాటి జీవితాన్ని, దానిని నడిపిస్తున్న చలన సూత్రాలను అర్థం చేసుకోవడం చాలా కష్టం. అర్థం చేసుకున్న వాటిని కథలుగా మలచుకుని వాటికి సాహిత్యతను ఇవ్వడం మరింత కష్టం. రచయిత శిల్ప సామర్థ్యం తక్కువగా ఉన్నవాడైతే ఆ కథలు ఉపన్యాసాలుగానో, శుష్కమైన చర్చలుగానో, రచయిత తెలివితేటల ప్రదర్శనగానో దిగజారి పోతాయి."
(వల్లంపాటి వెంకటసుబ్బయ్య ముందుమాట - దిశ)

తెలుగు కథను ఆ ప్రమాదం నుండి, దిగజారిపోకుండా కాపాడిన శిల్ప సమర్థులు వివిన మూర్తి. వివిన మూర్తి కథా జీవితం తెలుగునాట విప్లవ సాహిత్యం పుట్టుకతో ముడిపడి ఉంది. 1879లో ముతక రూపంలో మొదలైన తెలుగు కథ 1970 నాటికి చాలా పరిణత దశను చేరుకుంది. అనేక ఉద్యమాలకూ, అనేక భావజాలాలకు, అనేక సామాజిక సందర్భాలకు, సంఘటనలకు తెలుగు కథ అక్షర సాక్షిగా అప్పటికే రుజువు చేసుకుంది. వస్తు విస్తృతికీ, శిల్ప వైవిధ్యానికీ అప్పటికే తెలుగు కథ మూలస్తంభమైంది. అపరిణీత దశ నుండి తెలుగు కథను మరింత పరిపక్వదశకు తీసుకుని పోవడంలో వివిన మూర్తి పాత్ర తప్పకుండా ఉంది. ఆయన చిన్న వయసు నుండే కథలు రాసి ప్రచురణకు దూరంగా ఉన్న సమయంలో, మిత్రులెవరో వాటిని పత్రికలకు పంపిస్తే అవి అచ్చయ్యాయి. అలా ఆయన కథ 1971 నవంబరు ఆంధ్రజ్యోతిలో తొలిసారిగా అచ్చయింది. అందువల్ల వివిన మూర్తి కథా జీవితానికి అయిదు దశాబ్దాల చరిత్ర ఉంది. ఆయన ఇప్పటిదాకా వాల్ పేపర్, ప్రవాహం, దిశ, తీర్థపురాళ్లు, జగన్నాటకం, కథా ప్రహేళిక అన్న ఆరు కథాసంపుటాలు ప్రచురించారు. ఆయన కథలోని శిల్ప నైపుణ్యాన్ని స్థాలీపులాకన్యాయంగా పరిశీలించే ప్రయత్నమే ఈ వ్యాసం. ఈ వ్యాసానికి దిశ (2002), తీర్థపురాళ్ళు (2003), జగన్నాటకం (2006) అనే మూడు సంపుటాలు ఆధారం. ఈ మూడు సంపుటాలలో కొన్ని కథలలోని శిల్పాన్ని పరామర్శిస్తాను. వాటిలోని కథలన్నీ 1976 2003 మధ్య వివిన మూర్తి రాసినవి. అత్యవసర పరిస్థితి చీకటి రోజుల నుండి ప్రపంచీకరణ తొలి దశాబ్దం వరకు గల కాలం ఈ కథా కాలం. సాధారణంగా వివిన మూర్తి కథలు భారతదేశంలో ప్రబలిపోతున్న పెట్టుబడిదారీ వ్యవస్థ దుర్మార్గాలను అనేక భంగిమలలో అధిక్షేపిస్తాయి.

వస్తువును పాఠకునికి చేరవేయడానికే శిల్పం. అయితే కథకు వస్తువును ఎన్నుకోవడం సులభం. దానికి అనువైన శిల్పాన్ని ఎన్నుకోవడం కష్టం. ఎందుకంటే, వస్తువు కంటి ముందు కనిపిస్తూ ఉంటుంది. శిల్పం కథకుని భావనలో నుంచి వెలికివస్తుంది. వస్తువు తనరూపాన్ని తాను ఎన్నుకుంటుంది అనే అభిప్రాయం ఒకటి ఉన్నా, శిల్ప నిర్మాణంలో రచయిత భావుకత పాత్ర ముఖ్యమైనది. ఏ వస్తువును ఏ శిల్పంలో చెప్పాలి అన్నది రచయిత మేధస్సు పైన ఆధారపడి ఉంటుంది. కథకుని శిల్ప పరిజ్ఞానం అతని కథలకు ప్రాణం పోస్తుంది. కథ రాయడం మొదలు పెడితే ఏదో ఒక రూపం వస్తుంది. కానీ కథానిక కళా శోభితం కావాలంటే కథకుని పనితనం, శ్రమ అవసరమౌతాయి. ఏట్లో ఇసుకరేణువుకు కూడా ఒక రూపముంటుంది. దానికి మెరుగులు పెడితే అది కళాఖండమౌతుంది. అలాగే కథను కళాఖండం చేయాలంటే రచయిత శిల్ప శక్తి అవసరం. కథలో ఒక పాయింటు ఉంటుందనీ, కథంతా ఆ పాయింటు చుట్టూ తిరుగుతుందని తెలుగునాట అందరూ ఆమోదించిన అభిప్రాయం. కథలోని అనేకాంశాలను పాయింటు చుట్టూ తిప్పడంలో తెలుగు కథకులు అనేక పోకడలు పోయారు. వివిన మూర్తి మార్గం ఆయనదే. అంతమాత్రం చేత ఆయనది ఒంటి స్తంభపు మేడ కాదు. ఉత్తరాంధ్ర కథా సాహిత్య వాస్తవికతా సంస్కారమంతా ఆయనకు నేపథ్యంగా ఉంది. ఆయన మార్క్సిస్టు పరిజ్ఞానం ఆయన కథలను నడిపిస్తుంది. కథలో పాయింటు ముఖ్యమైనా, వివిన మూర్తి ఆ పాయింటు చిత్రణకే పరిమితం కారు. ఆ పాయింటు వెనకాల ఉండే ఆర్థిక రాజకీయ చరిత్రను దాని చుట్టూ అల్లుతారు. ఆయన కథలన్నీ సామాజిక చరిత్ర పరిణామాల ప్రతిఫలాలే. కానీ అవి, వల్లంపాటి చెప్పినట్లు ఉపన్యాసాలుగానో, రచయిత తెలివితేటలుగానో తేలిపోవు. చాలా ఒడుపుగా ఆయన చరిత్రను కథలో బిగిస్తారు. కథానిక కిటికీలోంచి చూస్తే కనిపించేంత జీవితాన్నే చూపిస్తుందనే అభిప్రాయానికి భిన్నంగా వివిన మూర్తి కథలు చిన్న పరిధిలో సుదీర్ఘమైన చరిత్రను సూచిస్తాయి. అలా చేయడానికి, కథా స్వరూప స్వభావాలు చెడిపోకుండానే, ఆయన తనదైన నిర్మాణ పద్ధతిని అనుసరించారు.

1970ల నాటికే వివిన మూర్తికి కమ్యూనిజంతో పరిచయం కలిగింది. వాస్తవికతకు కల్పనకు మధ్య అంతరం అర్థమైంది. ఇతరుల సమస్యలలో నుంచి తన సమస్యలనూ అర్థం చేసుకోవటం తెలిసింది. కాళీపట్నం రామారావు సాహిత్యంతో పరిచయం కలిగింది (ముందుమాట: జగన్నాటకం) ఈ సమయంలో వివిన మూర్తికి సమాజాన్ని వర్గ దృక్పథంతో చూడడం అలవాటయ్యింది. వర్గ సంఘర్షణలో తుది విజయం పేదలదేనన్న ఎరుక కలిగింది. ఈ ఎరుకలోనుంచి ఆయన వాస్తవికవాద శిల్ప రీతిలో అనేక కథలు రాశారు. ముడి మనిషి (1978) వివిన మూర్తి అవర్గీకరణ చెంది రాసిన కథలలో ఒకటి. నరిసి అనే ఒక దళిత స్త్రీలోని పోరాట శక్తిని వాస్తవికంగా ఆవిష్కరించిన కథ ఇది. వివిన మూర్తి 'అగ్గిపుల్ల, రొట్టె ముక్క' అని రెండు కథలు రాశారు. అగ్గిపుల్ల గ్రామీణ భూస్వాముల రాజకీయాలలో

నలిగిపోతున్న దళితుల జీవిత ప్రతిఫలనం. ఇద్దరు ఆధిపత్య భూయజమానుల దగ్గర ఇద్దరు దళితులు జీతగాళ్ళుగా ఉంటారు. యజమానుల ప్రయోజనాలు కాపాడడంలో దళిత సేద్య గాళ్ళు తమ జీవితాలను పణంగా పెట్టడానికి వెనుకాడరు. పెత్తందారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితుల మధ్య చిచ్చు పెడతారు. చివరికి పెత్తందారులు కలుసుకుంటారు. నష్టపోయింది మాత్రం దళితులే. ఈ వస్తువు మీదనే డా. పి. కేశవ రెడ్డి 'స్మశానం దున్నేరు', వీరపల్లి వీణావాణి 'రాకాసి కోన', వి ఆర్ రాసాని 'చీకటి రాజ్యం' నవలలు రాశారు. తిమ్మాపురం ఈ కథా స్థలం. ఈ కథ "అదిగో అదే తిమ్మాపురం" అని మొదలవుతుంది. 'అదిగో అదో తిమ్మాపురం' అని ముగుస్తుంది. బ్రహ్మయ్య, వీరయ్యలు దళితులు. ఇద్దరివీ రెండు వేరే శాఖలు. వీళ్లు వీర రాఘవులు, జోగి రాజుల దగ్గర సేద్య గాళ్ళు. కాలువ నీళ్ల దగ్గర బ్రహ్మయ్య, వీరయ్యలు తగాదా పడతారు. కథ మొదలయ్యే సరికి వీర రాఘవులు, జోగి రాజుల మధ్య శత్రుత్వం ఉంటుంది. కథ ముగిసేసరికి దళితులు విడిపోతారు. ఈ ఇద్దరూ ఏకమవుతారు. ఈ వాస్తవాన్ని రచయిత చక్కని చిత్రణ లో ఆవిష్కరించారు. బ్రహ్మయ్య పాత్రచిత్రణ వివిన మూర్తి వర్ణనాత్మకంగా చేశారు. చెప్పులు తీసి చేత్తో పట్టుకుని, అరుగు మీద కూర్చుని ముఖాలు కడుక్కుంటున్న ఒకరిద్దరికి దణ్ణాలు పెట్టుకుంటూ, పెద్దవీధి దాటాడు బ్రహ్మయ్య. పచ్చటి వరిచేల మధ్యనుండి నడుస్తుంటే కష్టజీవులు వాళ్ల చెప్పులను తాకగలుగుతున్న సంబరంతో భూమి చేస్తున్న నాట్యంలా చల్లగాలికి లయగా పరవశిస్తోంది చేను. ఇది శ్రమ జీవన సౌందర్య చిత్రణ. బ్రహ్మయ్యతో మమేకమయ్యారు

రచయిత బ్రహ్మయ్య వీరయ్యతో తగాదాపడతాడు యజమాని ప్రయోజనం కోసం. అతని హడావిడి చూసి వీరయ్య "యీ బావులు నీయా కావు, నాయీ కావు. మనలో మనకు గొడవేల?" అంటాడు. వీరయ్యకున్న తెలివి బ్రహ్మయ్యకు లేకపోవడంతో ఈ కథలో సంఘర్షణ పుట్టింది. ఈ కథలో మధ్యలో "మందు అమిరింది" అని, మరోచోట "అగ్గిపుల్లకి అగ్గిపెట్టె అమిరింది" అని, చివర్లో "అగ్గిపుల్ల భగ్గున మండింది" అని అన్నారు రచయిత. ఇది కథ పరిణామ దశలను సూచించే శిల్పరీతి. అగ్గిపుల్ల గ్రామీణ పెత్తందారుల వర్గ స్వభావాన్ని ఆవిష్కరిస్తే, 'సమవర్తి' కథ (1981) రైతు జీవిత విషాద పరిణామాలను ఆవిష్కరించింది. వివిన మూర్తి. కథకుడిగా నిలదొక్కుకున్నాక, తన కథలలో తీసుకున్న వస్తువుకు సంబంధించిన చరిత్ర వికాసాన్ని అద్భుతంగా పొదిగిస్తారు. ఆ శిల్పనైపుణ్యం వారికుంది. యముడిని సమవర్తి అంటారు. అందరి పట్ల సమానంగా ప్రవర్తించేవాడు సమవర్తి. అయితే భౌతికంగా వర్గాలతో నిండిన సమాజంలో అన్ని వర్గాల పట్ల సమానంగా ప్రవర్తించడం సాధ్యం కాదు. ఏదో ఒక వర్గం వైపు మొగ్గాలి. బహుశా వివిన మూర్తి, విప్లవ సాహిత్యోద్యమ నేపథ్యంలో శాంతియుత సహజీవన సిద్ధాంతాన్ని పూర్వపక్షం చేసి ఈ కథను రాశారనిపిస్తుంది. వర్గ సంఘర్షణ తప్ప వర్గ సామరస్యం కుదరదని చెప్పటం రచయిత ఉద్దేశ్యం.

'సినీవాలి' (1984) కథ చాలా బరువైన కథ. నిరుద్యోగం మానవ సంబంధాల మీద చూపే దుష్ప్రభావం ఎలా ఉంటుందో అనే భయంకర సత్యాన్ని ఈ కథ అద్భుతంగా ఆవిష్కరిస్తుంది. 'కలల రాజ్యం' (1992) వివిన మూర్తి రాసిన కథలలో చాలా చిన్నది. అంతేకాదు ఆ కథను ఆయన ఒక ప్రత్యేకమైన శిల్పంతో రాశారు. అన్ని పొడి పొడి వాక్యాలు కావడం ఆ ప్రత్యేకత. 'లలిత' అనే స్త్రీ జీవితం వ్యవస్థలోని సాంఘిక రాజకీయకారణాల వల్ల ఏయే పరిణామాలు పొందిందో ఈ కథ చెబుతుంది. తుపాకి పట్టుకునే పోలీసు కూతురైన లలిత "ఆయుధాలు లేని.. అవసరం లేని... రాజ్యంబీ ప్రతి మనిషి పూర్ణాయుష్కునిగా బతకటానికి అవకాశమిచ్చే సమాజం... మంచి కలలు కావాలి అమ్మా" ప్రశ్నించడం ఈ కథలోని సారం. అమ్మ ఆలోచనలో పడింది. నేను ఆచరణలో పడ్డాను.

అనే ముగింపు పాఠకునిలో తీవ్రమైన ఆలోచనలను రేకెత్తిస్తుంది. పొడి పొడి వాక్యాలు కథనంలో వేగం పెంచాయి. వర్ణనలు లేకుండా కథను ఎంత వేగంగా నడిపించవచ్చునో రచయిత చూపించారు. కథను ఏడు చిన్న ముక్కలుగా తుంచడం చూస్తే నిజానికి ఆ కథని చాలా పెద్ద కథగా ఉంచాల్సిందనిపిస్తుంది. ఆ నిడివిని పాఠకులే ఊహించుకునేటట్లు చేయడం ఈ కథా నిర్మాణ సూత్రం. 'సమవర్తి' కథలో రైతు జీవితం విభిన్న వ్యవస్థల మధ్య ఎలా పరిణామం చెందిందో చిత్రించిన వివిన మూర్తి, 'దిశ' (1992) కథలో వైద్యరంగం విభిన్న వ్యవస్థల మధ్య ఏ ఏ పరిణామాలకు లోనయిందో విమర్శనాత్మకంగా చిత్రించారు. భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థలో దోపిడీ స్వభావాన్ని ఆవిష్కరించి పాఠకులను సామ్యవాదం వైపు మళ్లించడాకి రచయిత ఒక్కో కథలో ఒక్కో సామాజిక రంగాన్ని ఎన్నుకున్నారు. ప్రపంచీకరణ మొదలైన తొలినాళ్లలోనే దాని దుర్మార్గాన్ని 'దిశ' కథలో చిత్రించడం విశేషం. 'మాయ మహామాయ' (1994) కథలో మరకతం, మాణిక్యం, చిన్న దిక్కు, పెద్ద దిక్కు వంటి పాత్రలతో వివిన మూర్తి పెట్టుబడిదారీ వ్యవస్థలోని పోటీ సంస్కృతిని వ్యంగ్యంగా ఆవిష్కరించారు. వస్తువుల ఉత్పత్తి, వాటి అమ్మకంలో సర్వత్రా పోటీ, దాని నుండి బయటపడడానికి పెట్టుబడిదారుల ఎత్తుగడలు ఈ కథలో పాఠకులను ఆశ్చర్యపరుస్తాయి. ఒక చిన్న చిన్న కథల పేర్లు చెప్పకుండా ప్రపంచ పెట్టుబడిదారుల స్వభావాలను ఆవిష్కరించాడు రచయిత. మరకతం, మాణిక్యం లాంటి పేర్లే ఈ కథా శిల్పంలో ముఖ్యాంశాలు. 'మాయ - మహామాయ' అనే శీర్షిక ధ్వన్యాత్మకమైంది. 'వీరుడు - మహా వీరుడు' అనే పేరును తలపిస్తుంది.

వివిన మూర్తి కథా నిర్మాణ ప్రతిభ మనకు 'కృష్ణ స్వప్నం' (1995) కథలో కనిపిస్తుంది. పౌరాణిక కథలను పునర్ వ్యాఖ్యానం చేసే సంప్రదాయం తెలుగులో బాగా విస్తరించింది. చలం, నార్ల, త్రిపురనేనిల నుండి ఓల్గా, డి.అర్.ఇంద్రల దాకా ఈ ప్రక్రియ బాగా అభివృద్ధి చేశారు. ప్రాచీన కథలను వర్తమాన దృష్టితో వ్యాఖ్యానించే సంప్రదాయమిది. అయితే ఇప్పటిదాకా పురాణ కథలను పురాణ కథల పరిధిలోనే వ్యాఖ్యానించారు మనవాళ్లు. కృష్ణ స్వప్నం వీటికి భిన్నమైన కథ.

వివినమూర్తి ప్రపంచీకరణ విస్తృత పరిణామాలను, రూపాలను కాలమహిమ (1996), జగన్నాటకం వంటి అనేక కథలలో తనవైన అధిక్షేపం, వ్యంగ్య సాధనాలతో ఆసక్తికరంగా చిత్రించారు. 'స్పర్శ' (1995) - ఈ కథను వివినమూర్తి ప్రత్యేక శ్రద్ధతో కథగా మలచినట్లు అనిపిస్తుంది. కోస్తా ప్రాంతం నుంచి సుబ్బారావు సునీత దంపతులు తమ కుమారుని రాయలసీమలోని హార్సిలీ హిల్స్ పాఠశాలలో చేర్పించడానికి వచ్చి, మధ్యలో సుబ్బారావు స్నేహితుడు మోహన రెడ్డిని కలవడానికి కందులపల్లికి పోతారు. ఆ మిత్రుడు ఫ్యాక్షన్ గొడవల్లో చిక్కుకొని ఉంటాడు. సుబ్బారావు అక్కడి బీభత్స వాతావరణాన్ని చూసి బెంబేలెత్తుతాడు. అక్కడి జీవితం చాలా అభద్రంగా ఉందని అర్థం చేసుకుంటాడు. తమ కుమారుని అలాంటి చోట చదివించడం ఇష్టం లేక సునీత తిరిగి వెళ్ళిపోదాం అంటుంది. ఈ కథలో రాయలసీమ ఫ్యాక్షన్ నేపథ్యంలో సమాజంలోని అనేక ఘర్షణలు ఒడుపుగా గుదిగుచ్చారు రచయిత. భద్రత అనేది ఈ కథలో కేంద్ర బిందువు. స్నేహితుని ఇంటి దగ్గర వాతావరణాన్ని రచయిత పరిశోధన చేసినట్లు చిత్రించారు. ఉత్తరాంధ్ర మరో ప్రాంత రచయిత రాయలసీమ ప్రాంత జీవితం పట్ల గల అవగాహనను చెప్పే కథ 'స్పర్శ'. గతంలో షేక్ నాజర్ 'నేటి రాయలసీమ' అనే బుర్ర కథ రాశారు. అంతకుముందే నారాయణ బాబు రాయలసీమ కరువు మీద ఒక నాటిక రాశారు. ఇటీవల సింహప్రసాద్ 'జీవధార' నవల రాయలసీమ నీటి సమస్య మీద రాశారు.

నల్లూరి రుక్మిణి 2003 -04 నాటి కరువు మీద కథ రాశారు. ద్వానా శాస్త్రి వంటి వాళ్లు కవితలు రాశారు. వివిన మూర్తి ఫ్యాక్షన్ మీద చాలా నిగ్రహంతో ఈ కథను రాశారు. "నీతో జీవితం ఎంత సెక్యూర్డ్‌గా ఉంటుందో" అనే సుబ్బారావు మాటతో మొదలైన కథ "ఇన్ సెక్యూర్డ్ ప్రపంచంలో జీవిస్తూ సెక్యూరిటీ అనే మృగతృష్ణ వెనకాల ఎన్నాళ్ళీ పరుగు సుబ్రావ్?" అనే భార్య సునీత మాటతో కథ ముగుస్తుంది. "భద్రమైనది బలమైనదిగా భావించే ప్రతి దాని పునాది డొల్ల!! డొల్ల! డొల్ల!!! అని కూడా తెలుసుకున్నాను" అనే సునీత ఎరుకతో కథ ముగుస్తుంది. 26 పుటల కథంతా రాయలసీమ నిర్దిష్ట సామాజిక వాస్తవికత మీద నడిచి, చివరికి ఒక తాత్వికతతో ముగించడం వల్ల 'స్పర్శ' కథకు అదనపు బలం చేకూరింది. ఇలా వివిన మూర్తి కథలు అనంతమైన శిల్ప రీతులతో కూడుకొని తెలుగు కథను-108-108 బలోపేతం చేశాయి. ఆయనది గంభీర శిల్పం. శరత్ రుతువులో పైన గంభీరంగా పారుతూ లోన సుడులు తిరిగే నదీ ప్రవాహం వంటిది. కథను ఇతిహాసంగా మార్చడానికి ఆయన చేసే వ్యాఖ్యలు చరిత్రను తవ్వి చూడమని సూచిస్తాయి.

"మానవ వేదనను సాహిత్యం మాత్రమే సమర్థవంతంగా ఇంతకాలం మోసింది. ఏ వేదనా లేని సమాజం మానవుడు చూసుకోగలిగితే బహుశా సాహిత్యం అవసరం తీరిపోతేవచ్చు" (వివినమూర్తి - ముందుమాట: దిశ)

అరసం బహుమతి పొందిన కవితలు-2023



చెల్లని రూపాయి

-చిందం రమేష్

ఇక్కడ
సృష్టి రహస్యపు దాకవరాలేవి తెరుచుకోనివ్వరు...
ప్రసవవేదన ఓ సాంఘిక దురాచారం
పదునైన ఓ కార్పొరేట్ కత్తి పెట్టే
అడ్డమైన కాటుకి మాత్రం ఆచారం అంటారు...
కత్తిగాట్లకి ముహుర్తం చూసి మురిసిపోతారు...
చనుబాలని గడ్డకట్టించి ప్లాస్టిక్ డబ్బాలోకి
ఎక్కించిన వాడే అసలైన నాగరికుడు...
అడ్డదారిలో వచ్చి అష్టవంకరల బుద్ధి కలవాడు
స్వతంత్ర జీవివని ప్రకటించుకున్న నాడు
తల దాచుకోవడానికి పైన ఆకాశం ఉండదు.
సరిహద్దులతో కుచించుకుపోతుంది...
వ్యాపార మేఘాలన్ని ఆశల తారలను కమ్మేస్తాయి...
ప్రతిరోజు ఓ చీకటి తెర వెనక
నీ చెమట చరిత్ర గొంతు నులిమి
సుగంధ లేపనాలు పూస్తారు...
ఎన్నో కృత్రిమ మేధో మథనాల మధ్య
నిన్ను పోగుల లెక్క పంచుకున్నాక
ఒక సుతారమైన సుందరి
ఒళ్లు మీద జారే సబ్బు నురుగతో చేసిన
లైట్ వెయిట్ సంకెళ్లతో నిన్ను బందిస్తారు.
కాని నిన్ను బంధించిన విషయం నీకే తెలియదు...
స్వేచ్ఛగ స్వచ్ఛమైన గాలిని కూడ పీల్చలేవు...
ఆక్సిజన్‌కి అత్తరు పూసి ఖరీదు కడతారు...
ఇగ వర్షం అంటావా? అది కురవదు...
నీ దుఃఖాన్ని తనలో కలుపుకోడానికి
అప్పుడప్పుడు తడిపొడిగా పడుతుంది అంతే...
టివిలో వాణిజ్య ప్రకటనలాగ
మనిషి ఆశ అంత పొడవు నిచ్చెన వేసుకుని
ఇంద్రధనస్సుకి కొత్త రంగులు వేస్తారు...
నీ స్వతంత్రం అంతా రకరకాల రంగు సీసాల్లో
రాత్రుళ్లు బుస్సున పొంగిస్తారు...
ఆ నిశీథి మత్తులో నింగి నేలను ఒకటి చేసి
నేను స్వేచ్ఛా జీవినని రెండు చేతులు చాచాలన్న
ఆ సాకర్యానికి సమయానికి అడ్డె కట్టాలి...
నిత్యం కార్పొరేట్ నీకొక రేట్ కట్టి
అంగడిలో ఆటబొమ్మగా ఆడిస్తుంటే
ఇగ నువ్వనుకునే
స్వేచ్ఛా, స్వతంత్రం అనేది ఇక్కడ చెల్లని రూపాయలే...

(అరసం యువ వచన కవితా పోటీలు-2023 లో ద్వితీయ బహుమతి పొందిన కవిత.)

ఒక క్రీడాకారుని నవరసభరిత ఆత్మకథ 'క్రీడాస్థలి'

గ్రంథ సమీక్ష

ఆత్మకథలు అనేకం, దేశాధ్యక్షులూ ప్రధానులూ సర్వ సైన్యాధ్యక్షులూ తత్వవేత్తలూ శాస్త్రవేత్తలూ, గొప్ప గొప్ప కవులూ కళా కారులు, చరిత్రను శాసించినవారు, చరిత్ర గతిని మార్చినవారు అంతా మహామహులు - మహానుభావులు. చాలావరకు అలాంటివారు రాస్తారు ఆత్మకథలు. అవి రకరకాలుగా ఉంటాయి. అద్భుతంగా ఉంటాయి. విశేషాలు ఉంటాయి. వివాదాలూ ఉంటాయి. అహో! అనిపిస్తాయి.

మరి అతను ఒక మామూలు మనిషి. ఏ ప్రత్యేకతలూ లేని మధ్యతరగతి మనిషి. పల్లెటూరి బిడ్డడు. అందునా ఒక క్రీడాకారుడు. ఎందరికో ఆటలు నేర్పినవాడు. ఆడించినవాడు. క్రీడల శాఖలో ఒక సాధారణ ఉద్యోగిగా చేరి అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి ఎదిగినవాడు. ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంత దశలో ఆత్మకథ రాస్తే...అందులో అద్భుతాలు ఏం ఉంటాయి? అనుకోవచ్చు. కానీ ఉన్నాయి. ఒక పోరాటం ఉంది. మంచి సందేశమూ ఉంది. అది కేవలం ఒక వ్యక్తి జీవిత పోరాటం మాత్రమే కాదు. గెలుపు ఓటముల మధ్య పోరాటం. వైయక్తిక సామాజిక జీవన విలువల పతనోన్నతాల మధ్య పోరాటం. ఒక ఆదర్శాన్ని, ఉన్నత విలువల్ని సుప్రతిష్ఠించాలనే ఆరాటపు పోరాటం. క్రీడాకారునిగా, క్రీడా శిక్షకుడిగా, ప్రభుత్వ ఉద్యోగిగా తాను పొందిన అనుభవ సారాన్ని రంగరించి అందించిన సందేశం ఉంది. అదీ "క్రీడాస్థలి"లో, ఆ సువిశాలమైన "మైదానం లోపల-బయట" కారంగుల మనోహర్ అనే ఒక క్రీడాకారుని నవరసభరిత జీవితం ఉంది.

తన గురువు పాల్వంచ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కొల్లి రామబ్రహ్మం కళాశాలలో బహిరంగ సభా వేదికపై నుండి "ఇతను సహజసిద్ధమైన క్రీడాకారుడు. మట్టిలో మాణిక్యం. రాష్ట్ర ఛాంపియన్‌గా అవతరిస్తాడు. ఆ బాధ్యత పూర్తిగా నాది." అని చేసిన ప్రతిజ్ఞ కార్యసిద్ధి పొందేందుకు తనవంతు కృషి చేసిన ఒక శిష్యుని దీక్షా దక్షతల కథనం ఈ ఆత్మకథ. లక్ష్యనిబద్ధులైన గురుశిష్యుల విజయగాథ ఇది. 1. క్రీడాకారునిగా.. సింథటిక్ ఉపరితలం, వివాహం 2. అథ్లెటిక్ శిక్షకుడిగా.. బదిలీ విధానం, డ్రగ్స్ వాడకం 3. జిల్లా క్రీడాధికారిగా (డియస్‌డిఓ)... క్రీడా అసోసియేషన్స్, రాష్ట్ర విభజన 4. రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్‌గా... ఎసిబి దాడి, గురుశిష్యులబంధం, ఇలా నాలుగు అధ్యాయాలుగా, ఒక్కో అధ్యాయంలో రెండేసి ప్రధానఅంశాలతో మనోహర్‌ఆత్మకథ నడిచింది.

"నువ్వు గెలిచేవరకూ నీకథ ఎవరికీ అవసరం లేదు. ఎవరూ వినిపించుకోరు కూడా. నీకథ ఎవరికైనా చెప్పాలన్నా వినాలన్నా ముందు నువ్వు గెలవాలి." అంటూ రచయిత ఆత్మకథను ప్రారంభించారు.

భూర్గుంపహాడ్ బ్లాక్ స్థాయి పోటీల్లో 7 ఈవెంట్స్‌లో మొదటి స్థానంలో బహుమతులు గెలిచి బ్లాక్ ఛాంపియన్‌గా నిలిచారు. ఖమ్మం జిల్లాస్థాయి పోటీల్లో గెలిచి జిల్లా ఛాంపియన్ అయ్యారు. రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో మొదటిసారి విఫలమైనా మరుసటి ఏడాది జరిగినపోటీల్లో ఒక బంగారుపతకం సాధించారు. రాష్ట్ర స్థాయిలో రెండు కొత్త రికార్డులను సృష్టించారు. మొత్తంగా నాలుగు పతకాలను కైవసం చేసుకున్నారు. జాతీయస్థాయిక్రీడల్లో కాంస్య పతకం సాధించారు. జాతీయక్రీడాకారుడిగా నిలిచారు.



క్రీడాస్థలి - మైదానం లోపల బయట
కారంగుల మనోహర్ (అథ్లెటిక్ కోచ్) ఆత్మ కథ.
పుటలు: 128, వెల: రూ.150/-
ప్రచురణ: సాహితీ బుక్ హౌస్, 40-20-39, ప్రగతినగర్, లబ్బీపేట, విజయవాడ-520 010

బ్లాక్ స్థాయి క్రీడల నుండి ప్రారంభమై మూడు సంవత్సరాల అనంతరం హర్యానా రాష్ట్రం హిస్సార్‌లో జరిగిన జాతీయ క్రీడల వరకూ సాగిన తన క్రీడా ప్రస్థానపు గెలుపు వ్యూహాలను వైఫల్యాల కారణాలను అత్యంత ఆసక్తికరంగా విశ్లేషాత్మకంగా వివరించారు. ఆయాసందర్భాలలో తనను వెన్నంటి ఉండిన పి.డి, కోచ్‌ల ప్రోత్సాహం, సహాయ సహకారాలు, తన విజయాల వెనుక వారి వ్యూహ రచనా చాతుర్యాలను సగౌరవంగా ఆవిష్కరించారు.

క్రీడాకారులపై సమాజంలో నాడున్న అపోహలు వాటి వెనుకనున్న కారణాలను సందర్భానుసారంగా ఆసక్తికరంగా వివరించారు. క్రీడా పోటీల విజయగాథలు చదివేప్పుడు మనం పాఠకులుగా కాక ప్రేక్షకులుగా మారిపోతాం. తన అనుభవాలను, అనుభూతులనూ అక్షరీ కరించే ప్రయత్నంలో రచయిత విజయం సాధించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో క్రీడా కోచ్‌గా, పదోన్నతుల అనంతరం ఉన్నత ఉద్యోగిగా తన అనుభవాలను చెప్తూ ఆ వ్యవస్థలోని లోటు పాట్లను లొసుగులనూ నిర్మోహమాటంగా చర్చించారు. ఈ వ్యవస్థలో నిజాయితీ, నిబద్ధతలకు అంకితమైన ఉద్యోగి చవిచూసిన అధికారుల విదిలింపుల, మందలింపుల చేదు అనుభవాలను, అవినీతి ఆరోపణలపై ఎసిబి విచారణ విషమ పరీక్షలను, అనుభవించిన క్షోభనూ, అనంతరం కడిగిన ముత్యంలా బయటపడ్డప్పుడు కలిగిన ఆనందాన్ని ఈ ఆత్మకథ కళ్ళకు కడుతుంది. అన్ని రంగాల్లో మాదిరిగా క్రీడారంగంలోనూ దిగజారుతున్న విలువల పట్ల రచయిత ఆందోళన కనిపిస్తుంది. విలువలను నిలబెట్టుకోవలసిన బాధ్యతను రచయిత పదే పదే గుర్తు చేశారు.

గురుశిష్య సంబంధానికి గల ఔన్నత్యాన్ని నిలబెట్టటంలో మనోహర్ రచన ఒక ఆదర్శంగా నిలుస్తుంది. ఎందుకంటే, తనలోని క్రీడాకారుని ప్రతిభను ప్రప్రథమంగా గుర్తించి, క్రమశిక్షణలో పెట్టి, సుశిక్షితుని చేసి బరిలో నిలిపి గెలిపించిన తొలి గురువు కొల్లి రామబ్రహ్మం గారికి తన ఆత్మకథను అంకితం చేశారు మనోహర్. తను దిద్దితీర్చిన తన ప్రియ శిష్యుడు యర్రా మాధవరావు ఈపుస్తకం వెలుగు చూడటంలో ప్రధాన భూమిక పోషించారు.

ప్రతి క్రీడాకారుడు, ప్రతి క్రీడా శిక్షకుడు, ప్రభుత్వ ఉద్యోగి కొని చదవవలసిన మంచి పుస్తకం "క్రీడాస్థలి".

- కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ

'సూక్తి రత్న మంజరి' ఆవిష్కరణ

రాజాం రచయితల వేదిక 'శతసాహితీ సమావేశ సంబరం' సందర్భంగా ఈ నెల 28వతేదీ ఆదివారం ఉదయం 10గం॥కు విజయనగరం జిల్లా, రాజాంలోని విద్యానికేతన్ పాఠశాలలో మా వేదిక నిర్వాహకుడు గార రంగనాథం రచించిన 'సూక్తి రత్న మంజరి' అనే గ్రంథాన్ని సాహితీ స్రవంతి రాష్ట్రశాఖ కార్యదర్శి చీకటి దివాకర్ ఆవిష్కరిస్తారు.

ఒమ్మి రమణమూర్తి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో తురంగి విశ్వనాథం పుస్తకపరిచయం చేస్తారు. తనికెళ్ళ లక్ష్మీనారాయణమూర్తి తదితరులు అతిథులుగా పాల్గొంటారు.

రాజాం రచయితల వేదిక

రాయలసీమ మహాకవి సమ్మేళనం

రాయలసీమ సాంస్కృతికోద్యమంలో భాగంగా "రాయలసీమ సాంస్కృతిక వేదిక" ఏడవ రాయలసీమ మహా కవిసమ్మేళనం నిర్వహిస్తుంది.

"రాయలసీమ కీలక సమస్యలు- భవితవ్యం" ఇతివృత్తంగా రాసిన కవితలను మే 25, 2023లోపు 99625 44299 వాట్సప్ నెంబరుకు పంపాలని కోరుతున్నాం.

అంతర్జాల వేదికన మే28 ఆదివారంనాడు కవి సమ్మేళనం జరుగుతుంది. కవులకు ప్రశంసాపత్రాలతో పాటు, కవితలను సంకలనంగా ప్రచురిస్తాం.

వివరాలకు:
డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి,
రాయలసీమ సాంస్కృతిక వేదిక, 99639 17187

పసికందుకు కిడ్నీల శస్త్రచికిత్స

- ఎయిమ్స్‌లో లాపరోస్కోపిక్ పైలోప్లాస్టీ విధానంలో నిర్వహణ
- ప్రపంచంలోనే అతి పిన్న వయసు రోగి

న్యూఢిల్లీ : ఇక్కడి ఎయిమ్స్‌లోని వైద్యులు మూడు నెలల బాలుడికి రెండు కిడ్నీల్లోని అడ్డంకులను తొలగించేందుకు లాపరోస్కోపిక్ శస్త్ర చికిత్స చేసినట్లు దేశంలోనే అత్యున్నత వైద్యసేవలందించే ఈ ప్రభుత్వాస్పత్రి వర్గాలు ఆదివారం తెలిపాయి. ఈ ప్రక్రియ చేయించుకున్న ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన రోగిగా నిలిచాడని పేర్కొన్నాయి. చిన్నపిల్లల విభాగంలోని వైద్యులు ద్వైపాక్షిక లాపరోస్కోపిక్ పైలోప్లాస్టీ విధానాన్ని నిర్వహించారు. ఇది యురేటెరోపెల్విక్ జంక్షన్ అడ్డంకికి చికిత్స చేయడానికి ఉపయోగించే కనిష్ఠ కోత శస్త్ర చికిత్స ప్రక్రియ. ఇది మూత్ర నాళాన్ని అడ్డుకునే, మూత్రపిండాల నుంచి మూత్రాశయానికి మూత్ర ప్రవాహాన్ని బలహీనపరిచే ఒక పుట్టుకతో వచ్చే పరిస్థితి. డిసెంబరులో ఈ ప్రక్రియను నిర్వహించారు. శస్త్రచికిత్స చేసిన మూడు రోజుల తర్వాత రోగిని డిశ్చార్జ్ చేశారు. అలాగే మూడు నెలల తర్వాత వైద్యులు రెనోగ్రామ్ అనే పరీక్షను నిర్వహించి శస్త్రచికిత్స విజయవంతమైందని, కిడ్నీ బయటకు వెళ్లే ప్రక్రియలో అడ్డంకులు తొలగిపోయాయని నిర్ధారించారని పీడియాట్రిక్స్ విభాగం అదనపు ప్రొఫెసర్ డాక్టర్ విశేష్ జైన్ తెలిపారు. 'విజయవంతమైన శస్త్రచికిత్స అత్యాధునిక శిశువైద్యం శస్త్రచికిత్స సంరక్షణలో ఎయిమ్స్ నిబద్ధతను ప్రదర్శించడమే కాకుండా, అనస్థీషియా పరిగణనలలో వైద్య సంస్థ నైపుణ్యాన్ని కూడా ప్రాధాన్యం చేసింది. ఫలితంగా కేవలం మూడు రోజుల్లోనే ఆ చిన్నారి డిశ్చార్జి అయింది' అని అఖిల భారత వైద్య విజ్ఞానాల సంస్థ (ఎయిమ్స్) ఒక ప్రకటనలో పేర్కొంది. మూడు నెలల బాలుడిపై కోతలను తగ్గించడానికి, గరిష్ఠ ప్రయోజనాలను పెంచడానికి లాపరోస్కోపీ విధానాన్ని ఉపయోగించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆస్పత్రి తెలిపింది. శస్త్రచికిత్సకు ముందు, సరైన ఫలితాలను నిర్ధారించడానికి విస్తృతమైన ప్రణాళిక నిర్వహించినట్లు వివరించింది. 'బొడ్డు బటన్ ద్వారా చొప్పించిన సూక్ష్మ కెమెరాను ఉపయోగించారు. అయితే ఒకే కోత కాకుండా రెండు వైపులా శస్త్రచికిత్సలను సులభతరం చేయడానికి అదనపు కోతలు వ్యూహాత్మకంగా చేశాము' అని ఆ ప్రకటన తెలిపింది. శిశువుకు సానుకూల ఫలితంతో పాటు లాపరోస్కోపిక్ విధానం భవిష్యత్తులో శస్త్రచికిత్సల అవసరాన్ని తొలగిస్తుందని డాక్టర్ జైన్ చెప్పారు. 'పీడియాట్రిక్ సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ ఎం బాజ్‌పాయ్ నాయకత్వం, మార్గదర్శకత్వంలో అటువంటి పరిస్థితులకు చికిత్స చేయడానికి లాపరోస్కోపిక్ పద్ధతులను ఎక్కువగా ఉపయోగించింది.

కర్నాటక ఫలితాలు మార్పుకు సంకేతం: పవార్

ముంబై: దేశంలో సామాజిక, మతపరమైన విభజనకు ఉద్దేశపూర్వకంగా యత్నిస్తున్న శక్తులపై పోరాటం ప్రతి ఒక్కరికి పెద్ద సవాల్‌గా ఉన్నదని ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ తెలిపారు. పరిస్థితులు క్రమంగా మారుతుందనేందుకు కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సంకేతమని చెప్పారు. శ్రామిక వర్గం బలంగా, ఐక్యంగా ఉంటే కర్నాటక తరహా ఫలితాన్ని దేశంలో ఎక్కడైనా సాధించవచ్చని ఆదివారం మహారాష్ట్ర, అహ్మద్‌నగర్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో పవార్ నొక్కిచెప్పారు. 'కొన్ని అధికార శక్తులు దేశాన్ని వెనక్కు నడిపిస్తున్నాయి. కులం, మతం పేరిట ఘర్షణలను ప్రోత్సహిస్తూ సమాజాన్ని విభజిస్తున్నాయి. అధికారాన్ని ప్రజా సంక్షేమానికి బదులు ప్రజలను విడగొట్టేందుకు వినియోగిస్తున్నాయి. ఇటువంటి శక్తులను అడ్డుకోకపోతే సామాన్యులు నాశనమైపోతారు. అహ్మద్‌నగర్ ప్రగతిశీల జిల్లా అయినాగానీ ఇటీవల షెవ్‌గావ్‌లో ఘర్షణలు జరిగాయి. కర్నాటకలో సామాన్యుల ప్రభుత్వం ఏర్పాటైంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన లక్ష మందిలో 70శాతం మంది వేర్వేరు వర్గాలకు చెందిన యువతీయువకులు ఉన్నారు. అందరితో కలిసి ముందుకు సాగుతూనే బలహీన వర్గాల ప్రయోజనాల సంరక్షణ కోసం కొత్త ముఖ్యమంత్రి పనిచేస్తారు. శ్రామిక వర్గం బలం, ఐక్యంగా ఉంటే కర్నాటక తరహా ఫలితాన్ని దేశంలో ప్రతిచోట సాధించవచ్చు' అని పవార్ ఉద్ఘాటించారు.

వీధి జంతువులకు 'హాస్పిటల్ ఆన్ వీల్స్'

రాంచీ: వీధి జంతువుల కోసం 'హాస్పిటల్ ఆన్ వీల్స్'ను జార్ఖండ్‌లో ప్రారంభించారు. సెంట్రల్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్ అధ్వర్యంలో సంచార వైద్యశాల అందుబాటులోకి వచ్చినట్లు అధికారులు శనివారం తెలిపారు. వీధులు, పార్కులు, గ్రామాలు, చుట్టుపక్క ప్రాంతాల్లోని జంతువులకు వైద్యంతో పాటు ఆరోగ్య సంరక్షణ కల్పించడమే ముఖ్య ఉద్దేశమని, జంతు వైద్యులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంటారని అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత మేరకు మైనింగ్ సంస్థ ఈ ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చినట్లు అధికారి వెల్లడించారు. 24 గంటల జంతువుల అంబులెన్స్, అత్యవసర ప్రతిస్పందన వాహనాన్ని సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ డైరెక్టర్ హర్షనాథ్ మిశ్రా ప్రారంభించారు. బాధిత జంతువులకు పునరావాసం కల్పన సమస్యకు ఇది పరిష్కారం చూపుతుందని, అంబులెన్స్ సేవలను హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఫర్ పీపుల్, ఎన్విరాన్మెంట్ (హోప్), జంతువుల ట్రస్టు అందిస్తాయని అధికారి వెల్లడించారు.

డబ్బులిస్తాం... మంత్రి పదవి ఇప్పించండి!

మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యేల నిర్వాకం

నాగ్‌పూర్: ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలకు రూ.కోట్లు ఎరగా వేసి వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలను బీజేపీ కూలుస్తుంటే ఆ పార్టీ ఎమ్మెల్యేలు మంత్రి పదవుల కోసం లంచాలు ఇస్తున్నారు. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే కేబినెట్‌లో మంత్రి పదవిని ఆశిస్తూ బీజేపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఒక వ్యక్తికి కోట్లాది రూపాయలు ముట్టజెప్పిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం ఉందని భావించి ముగ్గురు ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి లంచం ఇవ్వజూపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన నీరజ్‌సింగ్ రాథోడ్ తాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు పీఏని అంటూ బీజేపీ ఎమ్మెల్యేలకు పరిచయం అయ్యారు. తమకు మంత్రి పదవులు ఇప్పించాలని వారు కోరగా బీజేపీ అధిష్ఠానానికి లంచం ఇస్తే మీ పని సులువుగా జరుగుతుందని వారిని ఆయన నమ్మించాడు. దీంతో ఆ ఎమ్మెల్యేలు రూ.కోట్లు ముట్టజెప్పారు. అనంతరం ఆ వ్యక్తిముఖం చాటేశాడు.

మణిపూర్‌కు నిత్యావసరాలతో వెళ్లే

ట్రక్కులకు ప్రత్యేక భద్రత

ఇంఫాల్ : హింసాత్మక ఘటనలతో అట్టుడికిన మణిపూర్‌కు నిత్యావసర వస్తువులను తీసుకెళ్లే ట్రక్కులు ఈశాన్య రాష్ట్రంలో వస్తువుల కొరత లేకుండా చూసేందుకు ప్రత్యేక భద్రతతో తిరుగుతున్నాయని రక్షణ ప్రతినిధి ఆదివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సైన్యం, అస్సాం రైఫిల్స్, మణిపూర్ పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఎన్‌హెచ్ 37 మీదుగా ఇంఫాల్‌కు, తిరిగి వచ్చే వాహనాలకు రక్షణ కల్పించడానికి కృషి చేస్తున్నాయని వివరించారు. సైన్యం, అస్సాం రైఫిల్స్ ప్రొఫిలాక్టిక్ ఏరియా డామినేషన్ పెట్రోల్స్, ఎన్‌హెచ్ 37 వెంబడి ఉన్న కంపెనీ ఆపరేటింగ్ స్థావరాల నుంచి పని చేసే తక్షణ స్పందన బృందాలు, మానవరహిత వైమానిక వాహనాలు, చిరుత హెలికాప్టర్ల ద్వారా వైమానిక నిఘా, సీఆర్‌పీఎఫ్, మణిపూర్ పోలీసు సిబ్బందితో పాటు భారత రిజర్వ్ బెటాలియన్‌కు చెందిన సిబ్బంది ఎన్‌హెచ్ 37లో ప్రయాణించే పౌర వాహనాల భద్రతను నిర్ధారించడానికి మోహరించారని రక్షణ శాఖ ప్రతినిధి చెప్పారు. ప్రత్యేక భద్రతకు హామీ ఇవ్వడానికి, వాహనాలతో పాటు మణిపూర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ తక్షణ స్పందన బృందాలు కూడా ఉంటాయని ఆయన తెలిపారు. షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) హోదా కోసం మైతేయి సామాజిక వర్గం డిమాండ్‌కు నిరసనగా మే 3న పర్వత ప్రాంత జిల్లాల్లో 'గిరిజన సంఘీభావ యాత్ర' నిర్వహించిన తర్వాత మణిపూర్‌లో ఘర్షణలు చెలరేగడంతో రహదారి దిగ్బంధనాలు, రవాణాదారుల భయం కారణంగా ఇంఫాల్ లోయకు ట్రక్కుల తరలింపు నిలిచిపోయింది. 'ఫలితంగా, రాష్ట్రంలో అవసరమైన సామాగ్రి నిల్వలు క్షీణించాయి. ఆ పరిస్థితి క్లిష్ట స్థాయికి చేరుకోవడం ప్రారంభించింది. దీంతో ఎన్‌హెచ్ 37లో ట్రక్కులు నిత్యావసర వస్తువులను తీసుకువెళ్లేందుకు ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేశాము' అని ఇంఫాల్ రక్షణ శాఖ పీఆర్‌వో తెలిపారు. ఎన్‌హెచ్ 37లో ట్రక్కుల కదలిక మే 15న ప్రారంభమైందని, భద్రతా బలగాలు పూర్తి సాధారణ స్థితిని పునరుద్ధరించేందుకు కట్టుబడి ఉన్నాయని అధికార ప్రతినిధి తెలిపారు. మణిపూర్‌లో హింసాకాండకు ముందు కుకి గ్రామస్తులను రిజర్వ్ ఫారెస్ట్ భూమి నుంచి తొలగించడంపై ఉద్రిక్తత ఏర్పడింది. ఇది ఆందోళనలకు దారితీసింది.

జీతం పెరగకపోయినా

ఆదాయాన్ని పెంచుకోవచ్చు

సూచనలతో ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ సీఎంఓ లేఖ

ముంబై: ఉద్యోగుల ఈ ఏడాది వేతనాలను పెంచడం లేదని టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇటీవల చేసిన ప్రకటనతో కంపెనీ ఉద్యోగులు నిరాశచెందారు. కంపెనీ నిర్ణయంపై కొంత మంది ఉద్యోగులు బహిరంగంగానే ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దీనితో ఉద్యోగులను సంతృప్తిపరిచేందుకు కంపెనీ సీఈఓ చర్యలు ప్రారంభించారు. వేతన పెంపు విషయంలో కంపెనీ తీసుకున్న నిర్ణయంపై అసంతృప్తిగా ఉన్న ఉద్యోగులకు చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ (సీఎంఓ) క్రిస్టోఫర్ అంతర్గత లేఖ రాశారని ఫార్చ్యూన్ పత్రిక పేర్కొంది. వేతనం పెంచకపోయినా ఉద్యోగులు తమ ఆదాయాన్ని పెంచుకునే మార్గాన్ని ఆ లేఖలో సీఎంఓ సూచించారు. కంపెనీ తీసుకున్న నిర్ణయం వెనుక కారణాలను వివరిస్తూనే పరిహారం పెంచుకునే మార్గాన్ని అందులో సూచించారు. కంపెనీ స్టాక్ ధర పెరిగితే మీకు అందే పరిహారం దానంతటదే పెరుగుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ స్టాక్ ధర పెరిగేలా పనిచేయాలని సూచించారు. మెరుగైన త్రైమాసిక ఫలితాలు సాధిసే స్టాక్ ధర ఆకర్షణీయంగా మారుతుందని తెలిపారు. ఇప్పటికే ఈ ఏడాది కంపెనీ షేరు విలువ 33 శాతం పెరిగినట్లు క్రిస్టోఫర్ తన లేఖలో గుర్తు చేశారు. ఆర్థికంగా అనేక అస్థిర పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ ఏడాది ఉద్యోగులకు వేతన పెంపులు ఉండవని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల ఇటీవల స్వయంగా వెల్లడించారు. బోనస్‌లు, స్టాక్ అవార్డులు కొనసాగుతాయని తెలిపారు. మరోవైపు ఇతర టెక్ కంపెనీల తరహాలోనే మైక్రోసాఫ్ట్ సైతం ఉద్యోగులను తొలగిస్తున్న విషయం తెలిసిందే.

ఢిల్లీ, జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్

బీఎస్‌పీ శ్రేణులతో మాయావతి భేటీ

లక్నో : 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచేందుకు బీఎస్‌పీ అధినేత్రి మాయావతి ఆదివారం ఇక్కడ ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్‌కు చెందిన సీనియర్ పార్టీ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించినట్లు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. జమ్ముకశ్మీర్‌లో రాజకీయ అభివృద్ధిపై మాయావతి మాట్లాడుతూ కేంద్రం నుంచి ఆశించిన అభివృద్ధి, శాంతి, సుస్థిరత, అసెంబ్లీ ఎన్నికలకు బదులుగా, అవినీతి, అధికార దుర్వినియోగం మీడియా ముఖ్యాంశాలలో ఆధిపత్యం చెలాయిస్తున్నాయని అన్నారు. 'అన్ని రాజకీయ కార్యకలాపాలు అచేతనంగా ఉన్నప్పటికీ, జమ్ముకశ్మీర్ ప్రజలు రాజకీయ పరిణామాలపై దృష్టి పెట్టాలి. ఎప్పుడైనా అక్కడ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున పార్టీ పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలి' అని ఆమె అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ గెలుపు విషయమై బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షురాలు మాట్లాడుతూ సాధారణ ప్రజలు తమ సమస్యల పట్ల నిష్క్రియంగా లేరని అక్కడ ప్రభుత్వ మార్పు రుజువు చేస్తుందని అన్నారు. 'బీఎస్‌పీ అక్కడ తన లోపాలను అధిగమించి ముందుకు సాగేందుకు కృషి చేయాలి' అని తెలిపారు. జార్ఖండ్‌లో పార్టీలో 'యువ రక్తాన్ని' నింపాలని మాయావతి కఠినమైన ఆదేశాలు ఇచ్చారు. కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం మధ్య కొనసాగుతున్న అధికార పోరును ప్రస్తావిస్తూ, కేంద్రం, ఢిల్లీ మధ్య పరస్పర అపనమ్మకం, సహాయ నిరాకరణ, ఘర్షణ సామాన్య ప్రజలను ప్రభావితం చేసిందని, రెండింటి మధ్య అంతులేని ఘర్షణ విచారకరమని అన్నారు. 'రెండు ప్రభుత్వాల మధ్య ఘర్షణ, సుప్రీం కోర్టు పదేపదే జోక్యం చేసుకోవడం. సమాఖ్య సహకారవాదానికి ఇది మంచిది ఎలా అవుతుంది?' అని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ పట్ల ప్రజలు నిరాశతో ఉన్నారని, ఇప్పుడు ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం పట్ల ప్రజలు అసంతృప్తికి గురవుతున్నారని దళిత నాయకుడు అన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, పేదరికం, నిరుద్యోగం, నాసిరకం విద్య, ఆరోగ్య సదుపాయాలతో దేశవ్యాప్తంగా ప్రజలు అల్లాడుతున్నారని, అయితే బీజేపీ ప్రభుత్వం వీటిపై శ్రద్ధ చూపడం లేదని ఆమె అన్నారు. ఎన్నికలలో ఈ సమస్యలన్నింటిపై ఇప్పుడు ప్రజలు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం ప్రారంభించడం మంచి సంకేతమని తెలిపారు. రాజకీయ పార్టీల శూన్య వాక్చాతుర్యం, ఎన్నికల హామీలు, మతాన్ని మితిమీరిన వాడకానికి ప్రజలు ఇప్పుడు మేల్కొంటున్నారని, త్వరలో దేశ రాజకీయాల గమనం మారుతుందని, ఇది కొంచెం సమానమైన మైదానంలో ఎన్నికల్లో పోటీ చేయడానికి బీఎస్‌పీకి ఒక అవకాశం ఇస్తుందన్నారు. రిజర్వేషన్లను నిర్వీర్యం చేయడంపై ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజల్లో ఆగ్రహం ఉందని మాయావతి అన్నారు.

రాజీవ్ గాంధీ 'భారత్ గ్రేట్ సన్'

వర్ధంతి సభలో కాంగ్రెస్ నేతల నివాళి

న్యూఢిల్లీ : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే, గాంధీ కుటుంబ సభ్యులు ఆదివారం ఆయనకు నివాళు లర్పించారు. రాజీవ్ గాంధీ స్మారకం వీర్ భూమి వద్ద కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా తదితరులు పెద్ద సంఖ్యలో నివాళు లర్పించారు. తన తండ్రికి సంబంధించిన వీడియోను ట్విట్టర్‌లో పంచుకుంటూ రాహుల్ గాంధీ... 'పాపా, మీరు నాకు స్ఫూర్తిగా, జ్ఞాపకాల్లో ఎప్పుడూ ఉంటారు' అని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ జీవితానికి సంబంధించిన వీడియోను కూడా ఖడ్గే ట్విట్టర్‌లో పంచుకున్నారు. 'రాజీవ్ గాంధీ భారతదేశపు గొప్ప కుమారుడు. ఓటింగ్ వయస్సును తగ్గించడం, పంచాయతీరాజ్, టెలికాం, ఐటీ విప్లవం, స్థిరమైన శాంతి ఒప్పందాలను బలోపేతం చేయడం వంటి బహుళ జోక్యాల ద్వారా ఆయన భారతదేశాన్ని మార్చారు. 21వ శతాబ్దంలో ముందుకు నడిపించారు. ఆ అమరవీరునికి మా వినయపూర్వకమైన నివాళులు రోజు' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. 1984, 1989 మధ్య భారత ప్రధానిగా ఉన్న రాజీవ్ గాంధీని 1991లో ఎన్నికల ప్రచారంలో తమిళనాడులోని శ్రీపెరంబుదూర్ వద్ద ఎల్‌టీటీఈ ఉగ్రవాదులు హత్య చేశారు.

అప్పులులేని సీఎం నవీన్ పట్నాయక్

పెరిగిన సంపద

భువనేశ్వర్: ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆస్తులు స్వల్పంగా పెరిగాయి. రుణభారంలేని సీఎంగా నిలిచారు. నవీన్ పట్నాయక్, ఆయన మంత్రి మండలి సభ్యుల ఆస్తుల వివరాలను శనివారం ప్రకటించారు. ఆ వివరాలను పరిశీలిస్తే నవీన్ పట్నాయక్ అందరి కంటే అధిక ధనవంతుడిగా స్పష్టమవుతోంది. 2022 సంవత్సరానికి సంబంధించిన ఆస్తి,అప్పుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. మంత్రివర్గంలో అత్యంత అల్ప ఆస్తిపరుడిగా గనులు, ఉక్కు శాఖ మంత్రి ప్రఫుల్ల మల్లిక్ ఉన్నారు. గతేడాది కూడా ఆయనే అందరి కంటే తక్కువ ఆస్తిపరుడుగా నిలిచారు. నవీన్ పట్నాయక్ కేబినెట్‌లో అనేక మంది కోటీశ్వరులు ఉన్నారు.

అధికారిక లెక్కల ప్రకారం 2022లో ముఖ్యమంత్రి ఆస్తుల వృద్ధి విలువ రూ.42,86,069 పెరిగినట్లు తెలుస్తోంది. గతేడాది డిసెంబరు 31 నాటికి ఆయన ఆస్తుల విలువ రూ.65,40,79,694 కాగా, అంతకుముందు సంవత్సరం ఆస్తుల విలువ రూ.64.97 కోట్లకు పరిమితమైంది. అధికారిక పోర్టల్‌లోని ప్రకటన ప్రకారం, వివిధ బ్యాంకులు, పోస్టాఫీసులలో డిపాజిట్లు, వివిధ బాండ్ల పరంగా నవీన్ పొదుపు (నగదు) ఆస్తుల విలువ రూ.42,86,069కు పెరిగింది.

ముఖ్యమంత్రి చరాస్తుల విలువ రూ.12.52 కోట్లు. వీటిలో న్యూఢిల్లీ, భువనేశ్వర్, హింజిలికట్, బర్‌గడ్ బ్యాంకు ఖాతాల్లో నగదు, నగలు, నాలుగు చక్రాల వాహనం ఇమిడి ఉన్నాయి. బంగారు ఆభరణాల విలువ రూ. 3.49 లక్షలు కాగా, 1980 మోడల్‌కు చెందిన పాత అంబాసిడర్ కారు విలువ రూ.6,434గా పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి న్యూఢిల్లీలోని జన్‌పథ్ శాఖ బ్యాంకులో రూ.70.11 లక్షలు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భువనేశ్వర్ శాఖలో రూ.20.87 లక్షలు డిపాజిట్లు ఉన్నాయి. రూ.52.88 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. ఇవన్నీ ఆయన తల్లిదండ్రులు బిజు పట్నాయక్, జ్ఞాన్ పట్నాయక్ నుంచి సంక్రమించినవిగా పేర్కొన్నారు. ఈ స్థిరాస్తుల్లో భువనేశ్వర్‌లో నవీన్ నివాస్‌లో మూడింట రెండు వంతుల వాటా విలువ సుమారుగా రూ.9,52,46,190 కాగా, ఢిల్లీలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం రోడ్3లో ఉన్న ఆస్తిలో 50శాతం వాటా విలువ దాదాపు రూ.43,36,18,000గా ప్రకటించారు.

మహిళా ఐఏఎస్‌కు వేధింపులు

ఐఆర్ఎస్ అధికారి అరెస్ట్

న్యూఢిల్లీ: ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకువచ్చినా మహిళలపై జరుగుతున్న అరాచకాలను కట్టడి చేయలేకపోతున్నారు. పాఠశాలల్లో, బస్సుల్లో, కార్యాలయాల్లో వారిపై వేధింపుల పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా ఓ మహిళా ఐఏఎస్ అధికారికి కూడా ఈ వేధింపులు బెడద తప్పలేదు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఐఆర్ఎస్ అధికారిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన దేశ రాజధాని న్యూఢిల్లీలో చోటు చేసుకుంది. 2020లో కరోనా మహమ్మారి ఉధృతంగా ఉన్న సమయంలో కోవిడ్ సపోర్ట్ గ్రూప్‌తో కలిసి పనిచేస్తున్నప్పుడు నిందితుడు ఆమెతో టచ్‌లోకి వచ్చాడని పోలీసులు తెలిపారు. అప్పటి నుంచి ఆ వ్యక్తి బాధితురాలితో సన్నిహితంగా మెలగడానికి ప్రయత్నించేవాడనీ, ఆమె మాత్రం దానిని నిరాకరిస్తూనే వచ్చిందన్నారు. తనను వ్యక్తిగతంగా కలవాలని ఆమెకు మెసేజ్‌లు పంపుతూ వేధించేవాడు. ఒక్కోసారి ఆమె పనిచేస్తున్న కార్యాలయానికి వెళ్లి ఇబ్బంది పెట్టేవాడని మహిళా అధికారి తన ఫిర్యాదులో పేర్కొంది. నిందితుడిపై పోలీసులు కేసు నమోదుచేసి అరెస్ట్ చేశారు.

సీఎస్‌పై ఢిల్లీ మంత్రి ఆరోపణలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్ తనను చంపుతానని బెదిరిస్తున్నారని ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ తెలిపారు. ఈమేరకు ఆయన శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. రాత్రి 9:30 గంటల సమయంలో తన కార్యాలయానికి వచ్చిన సీఎస్.. 'నిన్ను చంపేస్తా' అని భయభ్రాంతులకుగురి చేశారని మంత్రి పేర్కొన్నారు. చీఫ్ సెక్రెటరీ తనను బెదిరిస్తున్నారని లెఫ్టినెంట్ గవర్నర్‌కు కూడా భరద్వాజ్ ఫిర్యాదు చేశారు. కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు.

రెండువేల నోట్ల మార్పిడికి పత్రం నింపక్కర్లేదు

ఎస్‌బీఐ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: రూ.2,000 నోట్లు బ్యాంకులో మార్చుకునే సందర్భంలో ఎలాంటి పత్రం నింపాల్సిన అవసరం లేదని భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్‌బీఐ) స్పష్టంచేసింది. రూ.20 వేల వరకు బ్యాంకులో నేరుగా మార్చుకోవచ్చని ప్రకటించింది. ఎలాంటి గుర్తింపు పత్రాలు కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొంది. నోట్ల మార్పిడి సమయంలో రిక్విజిషన్ ఫారం నింపాల్సి ఉంటుందనీ, దానికి ఆధార్ కార్డ్ లేదా ఇతర గుర్తింపు కార్డులు ప్రూఫ్‌గా సమర్పించాల్సి ఉంటుందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఎస్‌బీఐ ఈ విషయంపై స్పష్టతనిచ్చింది. ఈ మేరకు అన్ని బ్యాంకు శాఖలకు ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్.మురళీధరన్ ఉత్తర్వులు జారీ చేశారు. చలామణి నుంచి రూ.2,000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) శుక్రవారం ప్రకటించినప్పటి నుంచి ప్రజల్లో అనేక సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే నోట్లను మార్చుకునే సమయంలో ఫారం నింపాల్సి ఉంటుందన్న వదంతులు చక్కర్లు కొడుతున్నాయి.

ఏదైనా గుర్తింపు ధృవపత్రాన్ని కూడా సమర్పించాలని కొందరు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ పైమేరకు స్పష్టతనిచ్చింది. ప్రస్తుతం ఈ నోట్లు ఉన్న ప్రజలు వాటిని ఈ నెల 23 నుంచి సెప్టెంబరు 30వ తేదీలోపు బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకోవచ్చని, ఇతర నోట్లలోకి మార్చుకోవచ్చని తెలిపింది.

జగన్ ప్రభుత్వ పతనం ఖాయం

కొల్లి నాగేశ్వరరావు వర్థంతి సభలో వక్తలు

విశాలాంధ్ర–విజయవాడ: అమరావతి రాజధాని నిర్మాణానికి 34,387 ఎకరాల భూములిచ్చిన 30 వేల మంది రైతు కుటుంబాల జీవితాలను ప్రశ్నార్థకం చేస్తూ, చెలగాటమాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పతనం తథ్యమని ప్రముఖ కమ్యూనిస్టు, రైతు ఉద్యమ నేత కొల్లి నాగేశ్వరరావు వర్థంతి సభలో వక్తలు ఉద్ఘాటించారు. 'దున్నేవానికి భూమి' నినాదంతో చల్లపల్లి జమీందారు మిగులు భూముల పంపిణీ కోసం సుదీర్ఘ కాలం చిన్న, సన్నకారు రైతులు సాగించిన ఉద్యమానికి నాయకత్వం వహించి విజయ తీరాలకు చేర్చిన ధన్యజీవి, ఉమ్మడి కృష్ణా జిల్లాలో అనేక భూ పోరాటాలకు నాయకత్వం వహించి, శ్రీకాకుళం జిల్లాలో కంబిరిగాం భూ పోరాటానికి మార్గదర్శిగా నిలిచిన అమరజీవి కొల్లి నాగేశ్వరరావు తృతీయ వర్థంతి సభ ఆదివారం విజయవాడలోని దాసరి భవన్‌లో జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం పూర్వ అధ్యక్షులు వై.కేశవరావు, తెలుగు రైతు అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, వామపక్ష రైతు సంఘాల నేతలు హరినాథ్, ప్రసాద్, విశ్రాంత ఇంజనీర్ పాపారావు, అమరావతి రైతు జేఏసీ కన్వీనర్ పువ్వాడ సుధాకర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం నాయకులు జమలయ్య తదితర ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. సభకు పెద్ద సంఖ్యలో రైతు, కమ్యూనిస్టు, ప్రజల సంఘాల నాయకులు, కార్యకర్తలు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. సామాజిక ఉద్యమకారుడు టి.లక్ష్మీనారాయణ రచించిన 'భూమి కోసం పోరు–భూమిచ్చి పోరు' 'చారిత్రాత్మక రైతాంగ ఉద్యమాలు–అమరావతి ఉద్యమం అజరామరం' శీర్షిక–ఉప శీర్షికలతో రాసిన పుస్తకాన్ని కొల్లి నాగేశ్వరరావు అధ్యయన కేంద్రం ప్రచురించింది. ఆ పుస్తకాన్ని అమరావతి రాజధాని పరిరక్షణోద్యమంలో అగ్రభాగాన నిలిచిన మహిళా శక్తి ప్రతినిధిగా, రాజధానికి 1.27 ఎకరాల భూమిచ్చి– మూడున్నరేళ్లుగా పోరు భూమిలో ముందు వరుసలో నిలబడ్డ వెంకటాయపాలెం గ్రామానికి చెందిన 75 సంవత్సరాల లంకా రాజ్యలక్ష్మీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ విభజన తర్వాత రాష్ట్ర రాజధాని నిర్మాణం కోసం అమరావతి పరిధిలోని 29 గ్రామాలకు చెందిన దాదాపు 30 వేల మంది రైతులు 34,387 ఎకరాలను, తమ పిల్లల భవిష్యత్తును పణంగా పెట్టి ఇచ్చారని తెలిపారు. భూ సేకరణ చట్టం–2013 ప్రకారం నష్ట పరిహారం, పునరావాస పథకం ద్వారా లభించే ప్రయోజనాలు పొందలేదన్నారు. రాజధాని లేని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు కోసం వారసత్వంగా సంక్రమించిన భూములను, తమ కష్టార్జితంతో సముపార్జించుకొన్న భూములను ఏపీ ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన భూ సమీకరణ చట్టం మేరకు 'అమరావతి రాజధాని నిర్మాణం–అభివృద్ధి' ప్రాతిపదికపై ఏపీ సీఆర్డీఏతో ఒప్పందం చేసుకొని ఇచ్చారని అన్నారు. ఆ ఒప్పందాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మూడున్నరేళ్లుగా అవిశ్రాంత పోరాటం చేస్తున్నారని వక్తలు తెలిపారు. అవమానాలు, అక్రమ కేసులు, పోలీసుల నిర్బంధకాండ, అష్టకష్టాలు అనుభవించారని, అనుభవిస్తున్నారని, అనేక మంది మరణించారని అన్నారు. అమరావతి రాజధాని అంశంపై హైకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ పై విచారణ కొనసాగుతున్న పూర్వరంగంలో మాస్టర్ ప్లాన్‌లోని రెసిడెన్షియల్ జోన్ బయట వాణిజ్య అవసరాల కోసం కేటాయించిన 1,400 ఎకరాలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇళ్ల స్థలాల పథకం పేరుతో సెంటు భూమి చొప్పున దాదాపు 50 వేల మందికి కేటాయించడానికి పూనుకోవడాన్ని వక్తలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ దుష్ట ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రైతాంగ వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతూ కర్నాటక ప్రజలు బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించారని, రాబోయే సాధారణ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఓటమి చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. బీటీ పత్తి విత్తనాలకు వ్యతిరేకంగా అమరజీవి కొల్లి నాగేశ్వరరావు సుప్రీం కోర్టులో వ్యాజ్యం దాఖలు చేసి, పోరాడి విజయం సాధించారని, మోదీ ప్రభుత్వం బీటీ ఆవాలు ఉత్పత్తికి అనుమతి ఇవ్వడం అత్యంత గర్హనీయమని వడ్డే శోభనాద్రీశ్వరరావు విమర్శించారు. విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కొల్లి నాగేశ్వరరావు చూపిన పోరాట స్ఫూర్తితో పోరాడాలని వక్తలు పిలుపునిచ్చారు. అమరావతి రాజధాని పరిరక్షణ కోసం మూడున్నరేళ్లుగా అవిశ్రాంతంగా సాగుతున్న ఉద్యమం, భూమికోసం–భుక్తికోసం, నైజాం ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటం, 1954లో కర్నూలు రాజధానికి కరవు యాత్ర, 1980 దశకంలో దేశ వ్యాప్తంగా జరిగిన రైతాంగ ఉద్యమాలు, మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ ఉద్యమంపై టి.లక్ష్మీనారాయణ తన పుస్తకంలో వివరించారు. 1900–1956 మధ్య ఆంధ్ర రైతు ఉద్యమం చరిత్రలోని ఉజ్వల ఘట్టాలకు సంబంధించి కొల్లి నాగేశ్వరరావు రాసిన చరిత్ర భాగాన్ని అనుబంధంగా పుస్తకంలో చేర్చారు.

ఐరాసలో సంస్కరణలు అనివార్యం

జీ7 సదస్సులో ప్రధాని మోదీ పిలుపు

హిరోషిమా: వర్తమాన ప్రపంచ వాస్తవికతలకు అద్దం పట్టలేనప్పుడు ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలి కేవలం మాటల వ్యవస్థగా మారుతుందని భారత ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఇలాంటి పర్థితిని నివారించేందుకు అంతర్జాతీయ సంస్థలో సంస్కరణలు అత్యవసరమని ఆయన ఆదివారం హిరోషిమాలో జీ7 సదస్సులో నొక్కిచెప్పారు. శాంతి, సుస్థిరత సవాళ్లను పరిష్కరించడం కోసం ఐరాస ఉన్నప్పుడు ఈ అంశాలపై వేర్వేరు ఫోరాలు చర్చించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. 'ఇది సమీక్షించాల్సిన అంశం. శాంతి, సుస్థితపై వేర్వేరు ఫోరాల్లో ఎందుకు మాట్లాడుకోవాలి? ఐరాస ఉన్నదెందుకు? శాంతి నెలకొల్పే ఉద్దేశంతోనే ఇది రూపుదిద్దుకున్నది. ఘర్షణలను సమర్థంగా అరికట్టలేకపోతోందా? ఉగ్రవాదం నిర్వచనాన్ని ఐరాసలో ఇంతవరకు ఎందుకని అంగీకరించలేదు? గత దశాబ్దానికి ముందు ఏర్పాటైన సంస్థలు 21వ శతాబ్దానికి సంస్థాగతంగా అనుకూలంగా లేవని పరిస్థితులను గమనిస్తే అర్థమవుతుంది. ప్రపంచంలో ప్రస్తుత వాస్తవికతలకు ఐరాస అద్దం పట్టడం లేదు. అందుకోసమే సంస్కరణలు అనివార్యమయ్యాయి. ఐరాస వంటి వ్యవస్థల్లో మార్పులు రావాలి. గ్లోబల్ సౌత్‌కు గళం కావాలి. అలా జరగని పక్షంలో ఘర్షణలు, యుద్ధాల అంతంపై చర్చలే సరిపోతాయి. ఐరాస, భద్రతా మండలి మాటల వ్యవస్థలుగా మిగిలిపోతాయి' అని మోదీ అన్నారు. ఐరాస శాశ్వత సభ్యత్వమున్న దేశాల్లో అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ ఉండగా శాశ్వత సభ్యత్వం కోసం పోటీ పడుతున్న దేశాల్లో భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, జర్మనీ, జపాన్ ఉన్నాయి.

మజీతియా కేసులో మళ్లీ సిట్ ఏర్పాటు

చండీగఢ్: ఎస్ఏడీ నేత విక్రమ్ సింగ్ మజీతియాపై మాదకద్రవ్యాల కేసు విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను పంజాబ్ ప్రభుత్వం తిరిగి ఏర్పాటు చేసింది. 2021, డిసెంబరు 20న నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాలు (ఎన్‌డీపీఎస్) చట్టం కింద మాజీ మంత్రి మజీతియాపై కేసు నమోదైంది. కొత్తగా ఏర్పాటైన సిట్ బృందానికి ఐజీ (పాటియాలా రేంజ్) ముఖ్విందర్ సింగ్ చిన్నా నేతృత్వం వహిస్తారని అధికారిక ప్రకటన పేర్కొంది. ఇంతకుముందు సిట్‌కు విజిలెన్స్ బ్యూరో డైరెక్టర్ రాహుల్ ఎస్ నాయకత్వం వహించారు. ఆయన అనేక అవినీతి కేసులను పర్యవేక్షిస్తున్నందున సిట్‌ను మరోసారి ఏర్పాటు చేసినట్లు ప్రకటన తెలిపింది. సిట్ సభ్యుల్లో మార్పు లేదని, ఏఐజీ రంజిత్ సింగ్ ధిల్లన్, డీఎస్పీలు రఘబీర్ సింగ్, అమర్‌ప్రీత్ సింగ్ కొనసాగుతారని పేర్కొంది. గతంలో చన్నీ ప్రభుత్వం ఏఐసీ బలరాజ్ సింగ్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేయగా ఆప్ అధికారంలో వచ్చాక ఐజీ గుర్షన్ సింగ్ సంధూ పర్యవేక్షణలో సిట్ ఏర్పాటైంది.

సాగుభూములతోనే జీవిత భద్రత

- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జల్లి విల్సన్
- ఆగస్టులో బాపట్లలో సంఘం రాష్ట్ర 22వ మహాసభలు

విశాలాంధ్ర బ్యూరో– బాపట్ల: పేదల జీవిత భద్రతకు ప్రతి కుటుంబానికి సాగుభూములు ఇవ్వాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. ఆగస్టు మాసంలో బాపట్లలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం బాపట్లలోని పూర్ణ ప్యాలెస్‌లో రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ రాష్ట్రంలో నికృష్ట పరిస్థితుల మధ్య జీవనం సాగిస్తున్న గ్రామీణ కష్టజీవుల జీవితాల బాగు కోసం 90 ఏళ్ల క్రితం ఆ నెల్లూరు జిల్లాలోని పుచ్చలపల్లి సుందరయ్య గ్రామం అనగానిపాడులో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి కష్టజీవులు, శ్రామిక వర్గాలు, పేదలు పక్షాన కమ్యూనిస్టు పార్టీ, వ్యవసాయ కార్మిక సంఘం అలుపెరుగని పోరాటం చేస్తున్నాయని తెలిపారు. 1975లో ఎన్నో ప్రత్యక్ష భూపోరాటాలు ఫలితంగా భూసేకరణ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఆ చట్టాన్ని బుట్టదాఖలు చేయడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చిందన్నారు. దీంతో 2005లో మరోసారి ఉద్యమం ఉధృతం చేసి దున్నేవాడిదే భూమి అని ప్రజలతో కలిసి పోరాటాలు చేయడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. దీంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం కోనేరు రంగారావు కమిటీ ఏర్పాటు చేయగా అందులో 144 సిఫార్సులు ఆమోదం తెలిపిందన్నారు. వెంటనే 5 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసినట్లు వివరించారు. రాష్ట్ర ప్రజలకు అందుతున్న పథకాలు అన్నీ కమ్యూనిస్టుల పోరాటాల ఫలితమేనని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం పేదలకు కేటాయించిన స్థలాలు ఇళ్ల నిర్మాణాలకు అనుకూలంగా లేవన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరిలో మార్పు రావాలని సూచించారు. కేవలం సెంటు స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకోవాలని చెప్పడం తగదని కనీసం మూడు సెంట్లు స్థలం కేటాయిస్తే లబ్ధిదారులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఒకనాటి ఉద్యమాల గడ్డగా పేరుగాంచిన బాపట్ల నూతన జిల్లాగా ఆవిర్భావించిందని, చండ్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, గుజ్జుల యలమందారెడ్డి, చల్లపల్లి నారాయణరావు, కాబోతు రామస్వామి, తురిమెళ్ల గోవిందయ్య, గొరికపూడి జోసఫ్, జేఎస్సార్ ఆంజనేయశాస్త్రి, వేములపల్లి శ్రీకృష్ణ, బావిరెడ్డి, వెంకటేశ్వరరావు, పెరవలి శ్రీరాములు వంటి ఎందరో మహానుభావులు నడయాడిన నెల బాపట్ల జిల్లాలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభలు జరపటం శుభపరిణామం అన్నారు. ఈ రాష్ట్ర మహాసభలకు ప్రతిఒక్కరూ చేయి కలిసి సహాయ సహకారం అందించి విజయవంతం చేయాలని విల్సన్ కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో రాష్ట్ర మహాసభలు నిర్వహించడం సాహసోపేత నిర్ణయమన్నారు. ఈ మహాసభలు జయప్రదం చేసేందుకు పార్టీ శ్రేణులు అహర్నిశలు కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభల నిర్వహణకు అనేక మంది విరాళాలు ప్రకటించారు. తొలుత ఏపీ ప్రజానాట్యమండలి బృందం విప్లవగీతాలు సభికులను ఉత్తేజపరిచాయి. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అద్దంకి నాగేశ్వరరావు, జేబీ శ్రీధర్, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఆర్.వెంకట్రావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్యామ్యూల్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నేత మేడా వెంకట్రావు, అమరవీరుల వారసుడు భావిరెడ్డి ప్రభాకర్ రావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

సంగీత దర్శకుడు రాజ్ కన్నుమూత

హైదరాబాద్: ప్రముఖ సంగీత దర్శకుడు రాజ్ ఆదివారం కన్నుమూశారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. గుండెపోటుతో ఆయన హఠాన్మరణం చెందారు. రాజ్ అసలు పేరు తోటకూర సోమరాజు. ఆయన ప్రముఖ సంగీత దర్శకుడు టీవీ రాజు తనయుడు. రాజ్ మరో ప్రముఖ సంగీత దర్శకుడు కోటితో కలిసి ఎన్నో చిత్రాలకు పని చేశారు. రాజ్–కోటి కాంబినేషనల్‌లో ఎన్నో చిత్రాలకు సంగీతం అందించి.. సినీ సంగీత అభిమానులను ఉఱ్రూతలూగించారు. దాదాపు 180 చిత్రాలకు ఇద్దరు కలిసి సంగీత దర్శకత్వం వహించగా.. 3వేలకుపైగా పాటలకు స్వరాలు సమకూర్చారు. ప్రళయ గర్జన చిత్రంతో రాజ్–కోటి ద్వయం సంగీత ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి ఎన్నో విజయవంతమైన చిత్రాలకు సంగీతాన్ని అందించారు. యముడికి మొగుడు, లంకేశ్వరుడు, ముఠా మేస్త్రి, బాలగోపాలుడు, బంగారు బుల్లోడు, హలో బ్రదర్, అన్న తమ్ముడు విజయవంతమైన చిత్రాలకు స్వరాలు సమకూర్చారు. హలో బ్రదర్ సినిమాకు నంది పురస్కారం అందుకున్నారు. ఆ తర్వాత వీరిద్దరూ విడిపోయారు. విడిపోయిన తర్వాత రాజ్ ఎక్కువ చిత్రాలు చేయలేదు. రాజ్ ఒక్కడే చేసిన సినిమాల్లో సిసింద్రీ, రాముడొచ్చారు. చిన్నిచిన్ని ఆశ తదితర చిత్రాలకు స్వరాలు అందించాడు. రాజ్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. రాజ్ మృతితో తెలుగు సినిమా పరిశ్రమలో విషాదం అలుముకున్నది. ఆయన మృతికి పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

విశాలాంధ్ర రీల్

ముంబైలో నాని కొత్త సినిమా షూటింగ్..!

హైదరాబాద్: ఎన్నో ఏళ్లుగా కమర్షియల్ సక్సెస్ కోసం ఎదురు చూస్తున్న నానికి దసరా అలాంటి విజయాన్నే అందించింది. ఇప్పటికీ ఈ సినిమా సాలిడ్ రన్‌ను కొనసాగిస్తుంది. గతనెల 30న విడుదలైన దసరా తొలిరోజు నుంచి బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపించింది. ఈ సినిమా ఆరు రోజుల్లో వంద కోట్ల క్లబ్‌లో నిలిచింది. ఇక నానికి ఈ సినిమాతో తిరుగులేని విజయాన్ని అందించింది. ఈ సినిమాతో నాని వంద కోట్ల హీరోగా మారాడు. ఇప్పుడు ఇదే ఉత్సాహంతో తన తదుపరి సినిమాను పూర్తి చేసే పనిలో ఉన్నాడు. ప్రస్తుతం నాని శౌర్యువ్ అనే కొత్త దర్శకుడితో ఓ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా చేస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ మొదలైపోయింది. కాగా తాజాగా చిత్రబృందం ఓ మేజర్ షెడ్యూల్ కోసం ముంబై వెళ్లిందట. వారం రోజులకు పైగా అక్కడే షూటింగ్ జరుగనుందట. ఈ షెడ్యూల్‌లో నానిపై కీలక సన్నివేశాలను తెరకెక్కించనున్నారట. తండ్రి– కూతురు సెంటిమెంట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో మృణాళ్ థాకూర్ హీరోయిన్‌గా నటిస్తుంది. వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మోహన్ చెరుకూరి, విజయేందర్ రెడ్డి సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

ఓటీటీలోకి విరూపాక్ష



హైదరాబాద్: సాయి ధరమ్ తేజ్ చాలా కాలం తర్వాత 'విరూపాక్ష'తో తిరుగులేని కంబ్యాక్ ఇచ్చాడు. నెల రోజుల క్రితం విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర కోట్లు కొల్లగొట్టింది. ఇప్పటికీ కొన్ని థియేటర్‌లో ఇంకా ఈ సినిమా ప్రదర్శితం అవుతుంది. దానికి తోడు ఈ సినిమా తర్వాత రిలీజైన సినిమాలన్నీ బ్యాక్ టు బ్యాక్ పెవిలీయన్ బాట పట్టడంతో ప్రేక్షకులకు మరో ఆప్షన్ కూడా లేక రీపీట్ షోలు వేశారు. పైగా చాలా కాలం తర్వాత మంచి థ్రిల్లర్ మూవీ రావడంతో ఫ్యామిలీ ఆడియెన్స్ కూడా బాగా సపోర్ట్ చేశారు. ఇటీవలే హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలై అక్కడ కూడా మంచి కలెక్షన్‌లు రాబట్టింది. ఇటీవలే ఈ సినిమా వంద కోట్ల క్లబ్‌లోనూ నిలిచింది. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో సాయి తేజ్‌కు జోడీగా సంయుక్త మీనన్ నటించింది. ఇక దర్శకుడిగా కార్తిక్ దండూ తొలి ప్రయత్నంలోనే మంచి విజయం సాధించాడు. తొలి సినిమాకే ఈ రేంజ్‌లో అవుట్ పుట్ ఇచ్చాడంటే మాములు విషయం కాదు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించాయి.

ఇన్ని నిబంధనలు అనవసరం

రూ.2వేల నోట్ల మార్పిడిపై ఏఐబీఈఏ - ఐబీఏకు లేఖ

చెన్నై: గతంలో పెద్దనోట్లను రద్దు చేసినప్పుడు పడిన పాట్లు మరువకముందే రూ.2వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించడంతో ప్రజలతో పాటు బ్యాంకులలో గందరగోళం నెలకొన్నది. రూ.2వేల నోట్లను మార్పు చేసుకోవాలని ప్రజలకు సూచించిన కేంద్రం... ఇందుకోసం బ్యాంకులకు అనేక రకాల మార్గదర్శకాలను జారీ చేసింది. నోట్లను మార్చుకునే వారి పేరు, ఐడీ రుజువు, కరెన్సీనోట్ల వివరాలు వంటివి సేకరించాలని పేర్కొంది. అనెక్చర్ 3 ప్రకారం వ్యవహరించాలని సూచించింది. దీంతో అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (ఏఐబీఈఏ) ఆదివారం భారత బ్యాంకుల సమాఖ్య (ఐబీఏ)కు ఓ లేఖ పంపింది. రూ.2వేల నోట్లను రద్దు చేయలేదని ఆర్బీఐ చెప్పినప్పుడు మార్పిడి ప్రక్రియను సరళీకరించాలని ఐబీఏను ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం కోరారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకొని, అన్ని బ్యాంకులకు ఏకరూప్య మార్గదర్శకాల జారీతో పాటు ప్రజలకు, బ్యాంకు సిబ్బందికి సరళంగా ఉంటే ప్రక్రియను సూచించాలన్నారు. రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేసినప్పుడు ప్రజలు, బ్యాంకు ఉద్యోగులు, అధికారులు పడిన కష్టాలను ప్రస్తావించారు. అనవసర చర్యలతో రూ.2వేల మార్పిడి ప్రక్రియ జఠిలంగా మారిందన్నారు. ప్రజలతో పాటు బ్యాంకు ఉద్యోగులు, అధికారులకు ఇది ఒక ప్రహసనంగా తయారైందని చెప్పారు. రూ.2వేల నోట్ల మార్పిడి వల్ల బ్యాంకు కౌంటర్లలోని సిబ్బంది ముఖ్యంగా క్యాష్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు ఎక్కువగా శ్రమించాల్సి ఉంటుందని తెలిపారు. రూ.2వేల నోట్లను రద్దు చేయలేదని, అవి చెల్లుతాయని ఆర్బీఐ స్పష్టంగా చెప్పినప్పుడు మార్పిడి ప్రక్రియను సరళీకరించడం శ్రేయస్కరమని, ఇందుకు కృషిచేయాలని ఐబీఏను వెంకటాచలం కోరారు.

28న ఢిల్లీలో మహిళల మహాపంచాయత్

- 23న జంతర్‌మంతర్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన
- రెజ్లర్లకు మద్దతుగా సర్వ ఖాప్ పంచాయత్ ప్రకటన

రొహటక్: తమ గౌరవం కోసం నెలకుపైగా దిల్లీ వేదికగా పోరాడుతున్న జాతీయ స్థాయి మహిళా రెజ్లర్లకు మద్దతుగా 28వ తేదీన పార్లమెంటు నూతన భవనాన్ని ప్రధాని మోదీ ప్రారంభించనున్న సందర్భంగా అదే రోజు మహిళా మహాపం చాయత్ నిర్వహిస్తామని సర్వ్‌ఖాప్ పంచాయత్ ప్రకటన చేసింది. అలాగే, 23న జంతర్ మంతర్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తామని పేర్కొంది. ఈ మేరకు ఆదివారం హరియాణా, రొహటక్, హెహం పట్టణంలో జరిగిన సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపింది. రెజ్లర్ల డిమాండ్లను పరిష్కరించేందుకు కేంద్రంపై ఒత్తిడి పెంచడంతో పాటు తమ బలాన్ని ప్రదర్శించే విధంగా దేశ నలుమూలల నుంచి మహిళలు మహాపంచాయత్‌లో పాల్గొంటారని వెల్లడించింది. డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని, ఆయనకు నార్కో పరీక్ష చేయించాలని డిమాండ్ చేసింది. కొవ్వొత్తుల ప్రదర్శనలో భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేస్తామని ప్రకటించింది.

రెజ్లర్లకు అండగా నిలుస్తాం: ఏఐబీఈఏ

సమాజంలో మహిళల భద్రత, గౌరవానికి సంబంధించిన వ్యవహారం కాబట్టి రెజ్లర్ల డిమాండ్ల సాధనకు అన్ని విధాలా మద్దతిస్తామని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (ఏఐబీఈఏ) ప్రకటించింది. రెజ్లర్ల న్యాయ పోరాటానికి సంఘీభావం తెలిపింది. కర్నాటకలో బీజేపీ ఓడిపోతేగానీ డబ్ల్యూఎఫ్ఐ బాధ్యతల నుంచి బ్రిజ్‌భూషణ్‌ను తప్పించలేదని విమర్శించింది. రెజ్లర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సాధ్యమైన సహాయ సహకా రాలను అందించాలని ఈనెల 13,14,15 తేదీల్లో ముంబైలో జరిగిన ఏఐబీఈఏ 29వ జాతీయ సదస్సు నిర్ణయించినట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం వెల్లడించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.